విలేఖరులు
కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాధాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394
సంప్రదించగలరు ఎడిటర్ చల్లా శ్రీకాంత్

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 50 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | గురువారం 6 జూన్ 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00
GUNTUR | VOL-01 | ISSUE - 50 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 6 THUSDAY JUNE 2024 | PAGES : 8 | Rs :2-00

# ఎన్డీఏ పక్షనేతగా నరేంద్ర మోడీ ఏకగ్రీవ ఎన్నిక: కీలక తీర్మానాలకు ఆమోదం

న్యూఢిల్లీ: నేషనల్ డెమోక్రాటిక్ అలయెన్స్ పక్ష నేతగా నరేంద్ర మోడీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాని మోడీ నివాసంలో బుధవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్?డీఏ పక్షాల నేతలు ఎన్నుకున్నారు.ఇక ముచ్చటగా మూడోసారి మోడీ ప్రధాని పీఠంపై కూర్చోనున్నారు. జూన్ 8న ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. ఎల్లుండి రాష్ట్రపతిని ఎన్డీఏ పక్ష నేతలు కలవనున్నారు.ఈ సందర్భంగా కీలక తీర్మానాలు ఆమోదించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్?డీఏ ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ విధానాల కారణంగా గత పదేళ్లలో దేశంలోని 140కోట్ల మంది ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు ఓ తీర్మానం ఆమోదించారు. దాదాపు 6 దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత దేశ ప్రజలు వరుసగా మూడోసారి సంపూర్ణ మెజారిటీతో బలమైన నాయకత్వాన్ని ఎన్నుకున్నట్లు ఎన్?డీఏ నేతలు చెప్పారు.2024 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్డీఏ ఐక్యంగా పోరాడి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదలు, మహిళలు, యువత, రైతులు, దోపిడీకి గురవుతున్న,



అణగారిన వర్గాలకు అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఎన్?డీఏ నేతలు స్పష్టం చేశారు. భారతదేశ వారసత్వాన్ని పరిరక్షించడం ద్వారా దేశం సర్వతోముఖాభివృద్ధి కోసం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వెల్లడించారు.

**ఎన్డీఏ పక్షాల సమావేశంలో చంద్రబాబు సహా నేతలు**

ఎన్డీయే భాగస్వామ పక్ష నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశానికి బీహార్ సీఎం, జేడీయూ నేత నితీష్ కుమార్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు జాతీయ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎన్డీయేలో బీజేపీతో పాటు 15 పార్టీలు ఉన్నాయి.టీడీపీ, జేడీఎస్, ఆర్ఎల్డీ, సిక్కిం క్రాంతికారి మోర్చా, జనసేన, హిందూస్తానీ ఆవామీమోర్చా, అప్నాదళ్, అస్సాం గణపరిషత్, శివసేన(షిండే), అజిత్ పవార్(ఎన్సీపీ), జేడీయూ వంటి పార్టీలు ఉన్నాయి. నరేంద్ర మోడీ నేతృత్వంలో బుధవారం సాయంత్రం జరిగిన ఎన్డీయే సమావేశం తాజాగా ముగిసింది.ఈ సమావేశానికి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం ఎన్డీయే నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముని కలవనున్నట్లు తెలుస్తోంది. నేడే నరేంద్రమోడీ, అమిత్ షా, చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ కలిసి రాష్ట్రపతిని కలువనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతారని తెలిసింది.ఇప్పటికే కొత్త ప్రభుత్వ ఏర్పాటు కోసం రాష్ట్రపతిని కలిసిన మోడీ తన ప్రధాని పదవికి రాజీనామా చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు ఆపద్ధర్మ ప్రధానిగా ఉండాలని ఆమె కోరారు. జూన్ 8న ప్రధానిగా మూడోసారి నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

# ఈ 'సూపర్' పాండియన్.. రాజకీయాలను వీడతారా..?

భువనేశ్వర్: ఈసారి నవీన్ పట్నాయక్ ఒడిశా ముఖ్యమంత్రి కాకపోతే.. తాను రాజకీయాల నుంచి వైదొలుగుతానని వీకే పాండి యన్ ఎన్నికల ప్రచారంలో వెల్లడించిన సంగతి తెలిసిందే.ఐఏఎస్ అధికారి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ఆయన పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు మాట్లాడుతూ.."భాజపా వేవ్ ఉందని, ఒడిశాలో మార్పు ఉంటుందని మీరు చెప్తున్నారు. కానీ పట్నాయక్ మరోసారి ముఖ్యమంత్రి కాకపోతే, నేను రాజకీయాల నుంచి సన్యాసం తీసుకుంటా" అని ప్రతిజ్ఞ చేశారు.అయితే.. బీజేడీ అధికారంలోకి రాలేదు. భాజపానే ఆధిక్యత సాధించింది. 21 లోక్‌సభ స్థానాలకుగాను భాజపా 20 స్థానాలు గెల్చుకోగా.. కాంగ్రెస్ ఒక స్థానాన్ని సాధించింది. బిజూ జనతాదళ్ ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది. 147 అసెంబ్లీ స్థానాలకుగాను 78 చోట్ల భాజపా విజయం సాధించింది. 51 చోట్ల బీజేడీ గెలిచింది. కాంగ్రెస్ 14 స్థానాలు సాధించింది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి శాసనసభలో 74 స్థానాలు అవసరం కాగా, భాజపా ఆ సంఖ్యను దాటేసింది. ఆరోసారి ప్రమాణస్వీకారం చేసి.. సుదీర్ఘకాలం సీఎంగా బాధ్యతలు నిర్వహించిన ఘనతను సొంతం చేసుకోవాలన్న పట్నాయక్ కల ఈ ఫలితాలతో నెరవేరకుండా పోయింది. ఇక ఇప్పుడు భాజపా ముఖ్యమంత్రి ఎవరనేదీ ఖరారు కావాల్సి ఉంది. మాజీ కేంద్రమంత్రి జోయల్ ఓరం, భాజపా సీనియర్ నేత ధర్మేంద్రప్రధాన్, ఆ పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర, మరో నేత బైజయంత్ పండ సీఎం రేసులో ఉన్నారు.ఇదిలా ఉంటే.. గత ఏడాది పాండియన్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి.. బీజేడీలో చేరారు. 2019 ఎన్నికల ముందు నుంచి ఆయన నవీన్‌కు నమ్మకమైన అధికారిగా ఉన్నారు.

# ఏపీ సచివాలయంలో హై అలెర్ట్.. పోలీసుల తనిఖీలు.. డేటా చోరీ జరిగిందా?

అమరావతి :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ ఎన్నికల ఫలితాలలో టిడిపి కూటమి విజయం సాధించడంతో రాష్ట్రంలో పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. నిన్న తెలుగుదేశం కూటమి మెజారిటీ స్థానాలలో విజయకేతనం ఎగురవేయడంతో, ఏపీలో పాలనా పగ్గాలను చేపట్టడానికి సిద్ధమైన చంద్రబాబు నిన్ననే సీఎం ఆఫీస్ ను తన అధీనంలోకి తీసుకుని 2019 నుంచి 2024 వరకు ఉన్న ఫైల్స్ బయటకు పోకూడదని ఆదేశాలు జారీ చేశారు.

**సచివాలయంలోని ఐటీ విభాగంలో పోలీసుల తనిఖీలు**

ఇక ఏపీలోనూ తెలంగాణా తరహాలో డేటా చోరీ జరుగుతుందని, తెలంగాణా తరహాలో ఏపీలో కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, సజ్జల రామకృష్ణా రెడ్డి నేతృత్వంలో చేశారని డొక్కా మాణిక్య వరప్రసాద్ వంటి నేతలు సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఇక ఇదే సమయంలో తాజాగా సచివాలయంలోని ఐటి విభాగంలో నేడు పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

**డేటా చోరీ చేయడానికి, డిలీట్ చేయడానికి ప్రయత్నాలు.. ఆరోపణలు**

ఐటీ విభాగంలో ఉన్న కంప్యూటర్ల నుంచి డేటా చోరీ చేయడానికి, డిలీట్ చేయడానికి ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుతం పోలీసుల తనిఖీలపైన ఆసక్తి నెలకొంది. అమరావతిలోని సచివాలయం నుంచి డేటా చోరీ అవుతుందా? ఐటీ వింగ్ నుండి డేటా బయటకు వెళుతుందా? అన్న చర్చలు ఏపీలో జరుగుతున్న వేళ ఉన్నతాధికారులు అలర్ట్ అయ్యారు.




**ఐటీ వింగ్ వద్ద భారీ బందోబస్తు:** డేటా బయటకు వెళ్లకుండా, అనుమానం ఉన్న చోట తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతేకాదు ఐటీ వింగ్ ఎస్పీ నేతృత్వంలో సోదాలు చేయడంతో పాటు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ఫైలింగ్ ద్వారా నడుస్తున్న ఫైల్స్ అన్నింటినీ భద్రపరిచే వింగ్ వద్ద కూడా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

**ఉద్యోగుల నుండి పెన్ డ్రైవ్ లు, డేటా హార్డ్ డిస్క్ ల స్వాధీనం:** అధికారం మారుతున్న నేపథ్యంలో, డేటా బయటకు వెళ్లే అవకాశం ఉందన్న అనుమానంతో ఉద్యోగుల నుండి పెన్ డ్రైవ్ లు, డేటా హార్డ్ డిస్క్ లను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇప్పటికే డేటా చోరీ జరిగిందా? లేదంటే ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీసుల తనిఖీలు జరుగుతున్నాయా? అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. అయితే గతంలో చంద్రబాబు జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ-ఫైలింగ్ విధానాన్ని వ్యతిరేకించిన క్రమంలో తాజాగా ఈ విభాగంలో దాడులు కొనసాగటం ఆసక్తిని కలిగిస్తుంది.

# రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవికి సజ్జల రాజీనామా



అమరావతి: అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా ఘోరంగా ఓడిపోవడంతో పలువురు ప్రభుత్వ సలహాదారులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. జగన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డితో సహా 20 మందికి పైగా సలహాదారులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లుగా సీఎస్ జవహర్‌రెడ్డికి లేఖలు పంపారు.జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి తదితరులు ఇప్పటికే తమ రాజీనామా లేఖలు సమర్పించారు. ఫలితాలు వెలువడిన వెంటనే తితిదే ఛైర్మన్ పదవికి భూమన కరుణాకర్‌రెడ్డి రాజీనామా చేశారు. తనను రిలీవ్ చేయాలని సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలకు ముందు పదవీ కాలాన్ని పొడిగించాలని ఆయన ప్రభుత్వానికి దరఖాస్తు పంపించడం గమనార్హం.

# రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా: చంద్రబాబు



అమరావతి: ఎన్నికల్లో కూటమికి అఖండ విజయం కట్టబెట్టినందుకు రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెదేపా అధినేత చంద్రబాబు తెలిపారు.మీడియా సహా ప్రజలందరికీ ధన్యవాదాలు చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఈ ఐదేళ్ల తరహా ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. ఐదేళ్లలో వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయని చెప్పారు. సహజ సంపద విచ్చలవిడిగా దోచుకున్నారన్నారు. తాము మిగులు విద్యుత్ తీసుకొస్తే వైకాపా నాశనం చేసింది. 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచేసి ప్రజలపై భారం మోపారని వివరించారు.

**ఇలాంటి చరిత్రాత్మక ఎన్నికలు ఎప్పుడూ చూడలేదు**

"వైకాపా పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ఎలా ఇబ్బంది పడ్డాయో చూశాం. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలన్నదే మా ధ్యేయం. భావితరాల భవిష్యత్తు కోసం ముందుకెళ్లాం. రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదు. దేశం, ప్రజాస్వామ్యం, పార్టీలు శాశ్వతం. పార్టీలు కూడా సక్రమంగా పనిచేస్తే మళ్లీ ప్రజలు ఆదరిస్తారు. ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికలు ఎప్పుడూ చూడలేదు. అమెరికాలో ఉండే వ్యక్తి కూడా తపనతో వచ్చి పనిచేశారు. పక్క రాష్ట్రాల్లో కూలీ పనులకు వెళ్లిన వ్యక్తులు కూడా వచ్చి ఓటు వేశారు. తెదేపా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఎన్నికలు ఇవి. ఎన్టీఆర్ పార్టీ పెట్టినపుడు 1983లో 200 సీట్లు వచ్చాయి. మళ్లీ ఇప్పుడు ఊహించని విధంగా ఫలితాలు వచ్చాయి. కూటమికి 55.38 శాతం ఓట్లు వచ్చాయి. 45.60 శాతం తెదేపాకు, 39.37 శాతం వైకాపాకు వచ్చాయి. అవినీతి, అరాచకాలతో పనిచేసినందునే ఆ పార్టీకి ఇలాంటి గతి పట్టింది.

**మా కార్యకర్తలను హింసించారు**

ఈ ఐదేళ్లూ మా కార్యకర్తలు చాలా మంది ఇబ్బంది పడ్డారు. వారు కంటినిండా నిద్రపోలేదు. ప్రాణాలతో ఉండాలంటే జై జగన్ అనాలని హింసించారు. జై తెలుగుదేశం.. జై చంద్రబాబు అంటూ ప్రాణాలు వదిలిన పరిస్థితిని చూశాం. కార్యకర్తల త్యాగాల ఫలితమే ప్రజాస్వామ్యాన్ని కాపాడింది. మీడియా కూడా ఐదేళ్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. ప్రజాస్వామ్యమే సిగ్గుతో తల దించుకునే ఘటనలు జరిగాయి. ఎవరినైనా.. ఏదైనా చేయొచ్చని దాడులు చేశారు. విశాఖపట్నం వెళ్తే జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను వెనక్కి పంపించేశారు. కేసులు ఎందుకు పెట్టారని ఎవరైనా అడిగితే అరెస్ట్ చేశారు.మేం పాలకులం కాదు.. సేవకులమని పనిచేస్తాం. మా ఎన్నికల మ్యానిఫెస్టో ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడానికి వీల్లేదని పవన్ పట్టుబట్టారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన కృషి చేశారు. పవన్‌తో పాటు కూటమిలో భాజపా భాగస్వామ్యమైంది. ఎలాంటి పొరపాటు లేకుండా మేమంతా కలిసి పనిచేశాం. ఎన్డీయేలో భాగస్వాములుగా బాధ్యతతో ముందుకెళ్లాం. సమష్టి కృషితోనే అనూహ్య విజయం సాధించగలిగాం" అని చంద్రబాబు చెప్పారు.

**కింగ్ మేకర్.. జాతీయ ఛానెళ్లలో చంద్రబాబుపై ఆసక్తికర కథనాలు**

సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన తెదేపా అధినేత చంద్రబాబుపై జాతీయ మీడియాలో ఆసక్తికర కథనాలు ప్రసారమవుతున్నాయి.కూటమి తరపున ఆంధ్రప్రదేశ్‌లో 21 ఎంపీ స్థానాలు కైవసం చేసుకోగా అందులో తెలుగుదేశం పార్టీ సొంతంగా 16 స్థానాలు గెలుచుకుంది. జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమికి 293 స్థానాలు రావడంతో..సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కీలకంగా మారారని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.2024లో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని, ఈ క్రమంలో టీడీపీ, జేడీయూలు కింగ్ మేకర్లుగా మారనున్నారా? అంటూ ఎన్డీటీవీ కథనాలు ప్రసారం చేసింది. చంద్రబాబు ప్రధానంగా రెండు డిమాండ్లు చేయనున్నారని పలు అంశాలను ప్రస్తావించింది.ఎన్నికల ఫలితాలు, ఎన్డీయే కూటమి గెలుపుపై చంద్రబాబు మీడియా సమావేశం, అనంతర ఆసక్తికర పరిణామాలపై సీఎన్ఎన్-న్యూస్18 ప్రత్యేక బులిటెన్లు ఇచ్చింది. ప్రభుత్వ ఏర్పాటులో వీరిద్దరికి ఇచ్చే ప్రాధాన్యంపై భాజపా సంప్రదింపులు జరపనుందని పేర్కొంది.చంద్రబాబు నాయుడు, నీతీశ్‌కుమార్‌లు దేశ రాజధానికి చేరుకున్నారని.. కేంద్ర కేబినెట్‌లో ఈ పార్టీలకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వనుందనే కోణాలను విశ్లేషిస్తూ రిపబ్లిక్ వరల్డ్ కథనాలు ప్రసారం చేసింది.బుధవారం దిల్లీలోని ప్రధాని మోదీ నివాసంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో చంద్రబాబు, నీతీశ్ కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ పాత్ర ఎలా ఉండబోతోందన్న చర్చ నడుస్తోంది. గతంలో తెలుగుదేశం పార్టీ నుంచి జీఎంసీ బాలయోగి స్పీకర్‌గా పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. కేంద్రంలో తెదేపాకు చెందిన ఎంపీలు కీలక బాధ్యతలు నిర్వహించే అవకాశం రావొచ్చని భావిస్తున్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై నేతలు చర్చించినట్టు సమాచారం.

# 'నా ఎత్తెంతో నాకు తెలుసు'.. స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు

చెన్నై: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఇప్పుడు అందరి దృష్టి కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుపైనే..! ఎన్డీయే కూటమికి స్పష్టమైన ఆధిక్యం లభించినప్పటికీ..అనూహ్య పరిస్థితులు ఎదురైతే ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశాలు లేకపోలేదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీని గురించి తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను మీడియా ప్రశ్నించింది. 'ఒకవేళ ఇండియా కూటమికి అవకాశం లభిస్తే.. ప్రధాని అభ్యర్థి రేసు లో మీరు ఉంటారా?' అని అడగ్గా.. సీఎం ఆసక్తికరంగా బదులిచ్చారు.తన తండ్రి కరుణానిధి ఫేమస్ డైలాగ్‌ను ప్రస్తావిస్తూ.. "నా ఎత్తు ఎంతో నాకు తెలుసు. ఈ విషయాన్ని ఇప్పటికే చాలాసార్లు చెప్పా" అని విలేకరులతో అన్నారు. ఈసందర్భంగా ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ.. "గత ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలో మా కూటమికి 39 స్థానాలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 40కి 40 సాధించాం. ఈ విజయాన్ని నా తండ్రికి అంకితమిస్తున్నా. చాలా రాష్ట్రాల్లో మోదీ వ్యతిరేక గాలి వీచింది" అని అన్నారు. బుధవారం సాయంత్రం జరిగే ఇండియా కూటమి పార్టీల సమావేశంలో తాను పాల్గోనున్నట్లు



చెప్పారు.గతంలో కరుణానిధి 'ఎత్తు' వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన 13 సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. కానీ, కేంద్రంలో పాలన జోలికి వెళ్లకుండా రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యారు. అయితే 1997లో దేవెగౌడ ప్రభుత్వం పడిపోయాక.. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే ఆఫర్ కరుణానిధికి వచ్చిందట. ఇందుకోసం నేషనల్ ఫ్రంట్‌లోని కొంతమంది నేతలు ఆయనను సంప్రదించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే, 'నా ఎత్తు ఎంతో నాకు తెలుసు' అంటూ కరుణానిధి నాటి ఆఫర్‌ను తిరస్కరించినట్లు కథనాలు వచ్చాయి.

# మణిపూర్‌లో కాంగ్రెస్ విజయం.. ఆయనకు చెంపపెట్టు: జైరాం రమేశ

దిల్లీ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అంచనాలకు భిన్నంగా వెలువడ్డాయి. ఇండియా కూటమి 233 స్థానాలను కైవసం చేసుకొంది. అయితే.. జాతుల మధ్య వైరంగా కొనసాగుతున్న మణిపుర్‌లోని రెండు ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. కల్లోలిత ప్రాంతంలో హస్తం పార్టీ విజయం సాధించడంపై సీనియర్ నేత జైరాం రమేశ్ హర్షం వ్యక్తం చేశారు."గతేడాది మే 3 నుంచి జాతుల వైరంతో మణిపుర్ అల్లకల్లోలమవుతోంది. నాటినుంచి నేటివరకు అక్కడి ప్రజలు నిత్యం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎంతో ఒత్తిడికి లోనవుతున్నారు. మణిపుర్‌లోని రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్‌ను ఎన్నుకుని ఎంతో శక్తివంతమైన సంకేతాలను పంపారు. మణిపుర్ ప్రజలు హస్తం పార్టీకి పెద్ద బాధ్యతను అప్పగించారు" అని జైరాం రమేశ్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొన్నారు."క్లిష్ట సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మణిపుర్‌ను ప్రధాని మోదీ ఇంతవరకు సందర్శించలేదు. ఆయన ప్రజలను పట్టించుకోలేదు. గతంలో రాహుల్ గాంధీ



మణిపుర్ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రజలను సంప్రదించకుండా చేసింది. అనుమతించని ప్రాంతంలో కాంగ్రెస్ గెలుపు మోదీకి చెంపపెట్టు" అని కాంగ్రెస్ నేత తీవ్ర విమర్శలు గుప్పించారు.ఔటర్ మణిపుర్‌లో కాంగ్రెస్ తరఫున ఎన్నికల బరిలోకి దిగిన ఆల్‌ఫ్రెడ్ కన్‌ంగమ్ ఎస్.ఆర్థర్ తన సమీప ప్రత్యర్థి, ఎన్‌పీఎఫ్‌కి చెందిన కచుయ్ తిమోతీ జిమిక్‌ను 85,418 ఓట్ల తేడాతో ఓడించారు. ఇన్నర్ మణిపుర్‌లో అంగోమ్‌చా బిమోల్ అకోయిజం భాజపాకు చెందిన తౌనోజం బసంతకుమార్‌పై 1,09,801 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

# ఎడిటోరియల్

## వాన జ్ఞానం

ప్రపంచమంతటా సృష్టిగాథలు ఒక్కలానే ఉంటాయి. ఆదిలో అంతా జలమయమే. ఎందుకనీ? వర్షాలు... క్షణం తెరిపివ్వని వర్షాలు... బ్రహ్మాండమంత కుండతో ఎత్తిపోసినట్టు నిరంతర ధారాపాతాలు. ఆ తర్వాత ఎప్పుడో సూర్యుడూ, చంద్రుడూ, నక్షత్రాలూ పుట్టాయి. భూమి పైకి తేలింది. జీవి పుట్టింది. మనిషితో సహా రకరకాల రూపాల్లోకి పరిణామం చెందింది. వర్షం పడుతూనే ఉంది కానీ, నిర్విరామం నుంచి విరామానికి మారింది. చెప్పొచ్చేదేమిటంటే, వర్షం సృష్టి అంత ప్రాచీనంబీ ప్రకృతి అంత పురాతనం. మనిషి పుట్టిన చోటనే ఎప్పుడూ లేడు కనుక భ్రమణజీవిబీ అంతకన్నా ఎక్కువగా భ్రమలజీవి. తను ప్రకృతిలో భాగమన్న సంగతి మరచిబీ తన జీవితానికి, తన నిర్ణయాలకు తనే కర్తనన్న భ్రమ వాటిలో ఒకటి. శీతోష్ణాలను మించి ఆ భ్రమను పటాపంచలు చేయగలిగింది వర్షాలే. మనం బయటికి వెళ్లడానికి సిద్ధమవుతాం. ఆకాశం మబ్బు పట్టి ఉన్నా వర్షం రాదులే అన్న భ్రమతో గడప దాటుతాం. చినుకుతో మొదలై చూస్తుండగానే ఆకాశానికి చిల్లిపడిందా అన్నంత ఉధృతితో వర్షం ముంచెత్తుతుంది. చెట్టు కిందికో, చూరు కిందికో, మరో కప్పు కిందికో పరుగుతీస్తాం. వర్షనిర్బంధం నుంచి బయటపడడానికి నిలువుకాళ్ళ తపస్సు చేస్తాం. మనలానే, మనపక్కకి ఎవరెవరో అపరిచితులు వచ్చి చేరతారు. మాటలు కలుస్తాయి, ముచ్చట్లుగా మారతాయి, స్నేహాలను అల్లుకుంటాయి, ప్రేమలు మొలకెత్తుతాయి, అవి పెళ్లిళ్లకూ దారితీయవచ్చు. ఒక్కోసారి ఒకే ఒక్క వర్షం ఊహించని సన్నివేశాలను కల్పించి జీవితాలను పెద్దమలుపు తిప్పచ్చు. ప్రపంచ సాహిత్యంలో వర్షానుభవాన్ని చిత్రించని కథా, కావ్యం, నవలా దాదాపు ఉండవు. మనిషి బుద్ధిని బంకలా పట్టుకున్న మృగత్వం, కులమతాల భేదాలు, ధనిక, నిర్ధనిక తారతమ్యాలు, చదువు, అధికారంతో పుట్టే దుర్గర్వాలు సహా అన్ని రకాల మురికినీ, మకిలినీ కడిగి శుభ్రం చేసి మళ్ళీ మనిషిని చేయగల మంత్రజలం వర్షం. సమాజం గురించి మనుషుల గురించి నిశ్చితాభిప్రాయాల ఇరుకులో కరకుదేరిన అడ్వొకేట్ రావునూ, అతను చీదరించుకున్న బిచ్చగత్తెనూ ఒకచోటికి చేర్చిన పాలగుమ్మి పద్మరాజు కథ 'గాలివాన'నే చూడండి. ఆ క్షణంలో అతనికి అవసరమైన ఆ బిచ్చగత్తె ఆలింగనపు వెచ్చదనం అందించి అతనిలోని అరవయ్యేళ్ళ అజ్ఞానాహంకారాల జడలమర్రిని ఒక్క గాలివాన కూకటివేళ్ళతో కుప్పకూల్చింది. అతని బతుకు పలకను స్వచ్ఛజలాలతో పూర్తిగా ప్రక్షాళించి మానవత్వపు కొత్త ఓనమాలు దిద్దించింది. దాశరథి రంగాచార్య కథ 'తామరపూలు'లో చిట్టిపంతులికి తామరలే లోకం. ఋతుభ్రమణం గురించిన జ్ఞానం లేని ఆ అబ్బాయి ఎండాకాలంలో అవి కనిపించకపోయేటప్పటికి కలవరపడిపోయాడు. వానలు పడి తిరిగి కనిపించేవరకూ వాటికోసం ఒక జీవితకాలపు నిరీక్షణ. అలా ప్రకృతిపాఠాల బోధనలో వాన జ్ఞానకళిక అయింది. సొగసుతోపాటు ప్రకృతిలోని లయను, సమవర్తనను, ఒక్కోసారి అవి కలిగించే విషాదం గురించిన ఎరుకను తట్టిలేపే కథ మహేంద్ర రచించిన 'హొగినేకల్'. ఓ కుటుంబం ఆ కావేరి జలపాతాన్ని చూడడానికి చిన్న పాపను తీసుకుని వానను వెంటబెట్టుకుని వెళ్లింది. కావేరికి వరదెత్తి ఆ వరదలో పాప కొట్టుకుపోయింది. జీర్ణించుకోవడం కష్టమే కానీబీ 'ఇదే ప్రకృతి. ఇదే ప్రకృతిధర్మం. అది మంచిదీ కాదు, చెడ్డదీ కాదుబీ దాని దృష్టిలో అన్నీ సమానం. సృష్టిని అంగీకరించే మనిషి, లయను కూడా అంగీకరిస్తే పెనుగులాట ఉండ'దంటుందీ కథ. వాన మన వ్యక్తిత్వాలకు, ఆలోచనలకు ఒక స్పష్టతనివ్వడానికి కూడా ఎలా నేపథ్యమవుతుందో కుప్పిలి పద్మ కథ 'గోడ' చెబుతుంది. 'వాన. తూర్పు సముద్రపు కెరటాల నురగల మీద వాన. యారాడ కొండల గరిక మీద వాన. రుషికొండ ఎగుడుదిగుడుల మీద వాన...' అని మొదలయ్యే ఈ కథలో స్వతంత్రభావాలు కలిగిన ఒక అమ్మాయి తనతో చదువుకున్న ఒక అబ్బాయి గదిలో ఆ వర్షపురాత్రిని గడపాల్సివస్తుంది. అతనిలో మగాడు నిద్రలేచి హద్దుమీరబోతే ఆ అమ్మాయి వారించి గట్టిగా బుద్ధి చెబుతుంది. మహమ్మద్ ఖదీర్ బాబు అద్భుతంగా పునఃకథనం చేసి సవ్యాఖ్యానంగా సంకలనం చేసిన 'నూరేళ్ళ తెలుగు కథ'లో ఈ నాలుగు కథలూ చేరాయి. సహస్ర బాహువులతో జలఖడ్గాలు దూసి, ఉరుముల పెనుగర్జనలతో, మెరుపుల మిరుమిట్లతో వర్షం ఊరూవాడా ఆక్రమించుకుని జనాన్ని గృహనిర్బంధంలో ఉంచినప్పుడు ఇంకెన్ని చిత్రవిచిత్ర సన్నివేశాలు ఏర్పడగలవో తిలక్ కథ 'ఊరి చివరి ఇల్లు' చెబుతుంది. అలాంటి ఓ వర్షపురాత్రి ఒక ఆగంతక యువకుని రాక దుఃఖపూరితమైన ఒక యువతి జీవితంలో కొత్త ఆశా, ఉత్సాహాల జడివానగా మారి తెల్లవారేసరికి వానతోపాటే అదీ వెలసి అయ్యో అని పిస్తుంది. వర్షం కలిగించే అలజడి సరే, అంతకన్నా ఎక్కువగా వర్షాభావం సృష్టించే కన్నీటి జలపాతాల సంగతేమిటి? తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి గారి 'ఆమె దనంతపురం', 'పిచ్చి లచ్చుమ్మ', 'కదిరమ్మ పేరంటాలు' కథలు ఆ విషాద పార్శ్వాన్ని అనితరసాధ్యంగా అక్షరబద్ధం చేస్తాయి. మరిన్నికొత్త అనుభవాలను మబ్బులతో మూటగట్టి మళ్ళీ వర్షరుతువు వస్తోంది. అవి తీపినే నింపాలని కోరుకుంటూ హర్షోల్లాసాలతో పునఃస్వాగతం చెబుదాం.

# కూటమి విజయం చారిత్రాత్మకం



రాయల్ జర్నలిజం ( రాజంపేట) జూన్ 05 : తెలుగుదేశం పార్టీ,జనసేన, భాజాపా పార్టీల కూటమి విజయం చారిత్రాత్మకమని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తన క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అహంకారపూరిత రాజకీయాలు మనుగడ సాగించలేవని అన్నారు. ఇందుకు నిదర్శనమే ఈ ఎన్నికల ఫలితాలని ఆయన తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ పేరు చెబితేనే దాడులు,దౌర్జన్యాలు,అక్రమ అరెస్టులకు పాల్పడుతున్న తరుణంలో మొక్కవోని ధైర్యంతో పార్టీకి అండగా నిలబడిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు జగన్ మోహన్ రాజు ధన్యవాదాలు తెలిపారు చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో తెలుగుదేశం పార్టీకి చంద్రబాబుకు లోకేష్ కు అండగా నిలబడి ఎన్డీఏ కూటమి ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించి కూటమి అఖండ మెజారిటీకి పాటుపడిన జనసేన ని పవన్ కళ్యాణ్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అంతకుముందు ఎన్డీఏ కూటమి విజయం పట్ల కార్యాలయం నందు జగన్ మోహన్ రాజు అధ్యక్షతన కేక్ కట్ చేసి అనంతరం మదనపల్లె పార్టీ అభ్యర్థి గెలుపు పట్ల నాయకుల సమన్వయంతో గెలుపులో కీలక పాత్ర పోషించిన చమర్తి జగన్ మోహన్ రాజు ని ఘనంగా సత్కరించిన తెలుగుదేశం పార్టీ నాయకులు,అభిమానుల మధ్య సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి అమ్మినేని అజయ్ కుమార్,సిద్ధవటం మాజీ జెడ్పిటిసి చలమయ్య యాదవ్,ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ నాయుడు,సిద్ధవటం యువ నాయకులు రాజా నాయుడు, మండల సీనియర్ నాయకులు జీ.వి సుబ్బరాజు,శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్య, మండల సీనియర్ నాయకులు జీ.వి సుబ్బరాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్. సతీష్ కుమార్ రాజు, ఒంటిమిట్ట యువ నాయకులు హరినాథ్ రెడ్డి,టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్,తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధిని సింగన పరుశురాం నాయుడు, తెలుగు యువత పార్లమెంట్ సోషల్ మీడియా కో- ఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, ఒంటిమిట్ట శివారెడ్డి,సిద్ధవటం మండల బీసీ నాయకులు గాలి సుబ్బయ్య,కొల్లవారిపల్లె పవన్ కుమార్,సాయి,పెద్ద ఎత్తున నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడుదాం ఆరోగ్యంగా జీవిద్దాం - డాక్టర్ ఫైరోజా బేగం



రాయల్ జర్నలిజం ( వాల్మీకిపురం ) జూన్ 05 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ స్ఫూర్తి అన్నమయ్య క్లబ్ అధర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తికి పెరుగుతున్న అవసరాలు, తరుగుతున్న వనరుల కొరత ఇవి మానవ మనుగడికి ప్రమాదకరమని, దీని ప్రభావం పర్యావరణ పై కూడా చెడు ప్రభావం పడుతుందని, పెరుగుతున్న పట్టణీకరణ చెట్లను నాశనం చేయడం, వాహనాల వినియోగము నుండి వెలువడుతున్న పొగతో వాయి కాలుష్యం పెరిగి, శ్వాస కోసం సంబంధ వ్యాధులు, భూతాపం, భూమి వేడెక్కడం, వీటి మూలన అదుపులోకి రాని వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కావున మానవ క్షేమదాయక అవసరాల దృశ్య నీడనిచ్చే మొక్కలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, వీటి వినియోగాలు తగ్గించి గృహ వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్తాచెదారం, తగు రీతిలో నిర్మూలించడము చేయాలని, లేనిచో సంవత్సరముల పాటు ఈ వ్యర్థాలు భూమిలో నాశనం కాకుండా, భూసారం దెబ్బతిని, భూఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయని, ఫలితంగా గాలి, నీరు, భూమి, కలుషితానికి గురౌతున్నాయని, సామాజిక సంస్థలు ప్రముఖ వ్యక్తులు విద్యాలయాలు ఇతర ప్రభుత్వ యేతర సంస్థలు ముందుకు వచ్చి విస్తృత అవగాహన కల్పించి, పర్యావరణ పరిరక్షణకు తమవంతు విశేష కృషి చేయాల్సిన అవసరం ఉందని స్వచ్ఛమైన ఆహారం నీరు త్రాగాలి అంటే ఈరోజు నుంచి ప్రతి ఒక్కరు పుట్టినరోజు గాని వివాహ రోజు గాని ఏ సందర్భం మొక్కను విదిగా నాటాలని స్ఫూర్తి అన్నమయ్య క్లబ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి ఆవరణం లో చెట్లను నాటడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహిస్తూ అందురు ప్రతిజ్ఞ చేయడమైనది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సోనీ, శివాని, కిషోర్, క్లబ్ మెంబెర్స్ బాబాఫకృద్దిన్, మురళి గోవిందమ్మా, కృష్ణమూర్తి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



రాయల్ జర్నలిజం ( వాల్మీకిపురం ) జూన్ 05 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభు చరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం జీవరాశి ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య పర్యావరణ కాలుష్యమని, ప్రకృతి అవసరం మనిషికి ఎంతో ఉందని కానీ మనుషులు ఆ ప్రకృతిని తమ స్వార్థంతో కావలసిన దానికన్నా ఎక్కువగా వాడుకుంటున్నారన్నారు. ఇందువలన వాతావరణంలో ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. పట్టణాల విస్తీర్ణం పెరగడంతో అడవులు నరికివేతకు గురవుతున్నాయని తద్వారా వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు జంతువులకు తిండి దొరక్క జనాల్లోకి వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో పర్యావరణానికి మరింత ముప్పు వాటిలో అవకాశం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారన్నారు. పర్యావరణంపై ప్రభావం చూపుతున్న పారిశ్రామిక కాలుష్య ఉద్గారాలను నియంత్రించడం, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టడం, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వలన పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణానికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీదేవి, అధ్యాపకులు బాలగంగాధర్ తిలక్, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేష్, జాకబ్ రవికుమార్, జాన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మేల్కొందాం..మేల్కొలుపుదాం



రాయల్ జర్నలిజం ( లకిరెడ్డిపల్లి ) జూన్ 5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మండల లీగల్ సర్వీస్ కమిటీ కోర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎస్.కె పై జూనిష మాట్లాడుతూ జీవజాతి మనుగడకు పర్యావరణమే మూలాధారం. అలాంటి పర్యావరణంపై అభివృద్ధి పేరుతో మానవాళి యుద్ధం చేస్తోంది. కాలుష్యానికి కారణమవుతోంది. చెట్ల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, పరిశ్రమల నుంచి వచ్చే విషవాయువులు,జీవజాతి మనుగడకు పర్యావరణమే మూలాధారం. అలాంటి పర్యావరణంపై అభివృద్ధి పేరుతో మానవాళి యుద్ధం చేస్తోంది. కాలుష్యానికి కారణమవుతోంది. చెట్ల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, పరిశ్రమల నుంచి వచ్చే విషవాయువులు, వ్యర్థాలతో భూ తాపం పెరుగుతోంది. మానవ తప్పిదాల కారణంగా భూ, వాయు, జలకాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోంది. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేదు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో వాతావరణం భిన్నంగా ఉంటుంది. వర్షపాతం తక్కువ పచ్చదనం అంతంత మాత్రమే. ఇప్పటికే పలు ప్రాంతాలు ఎడారిగా మారిపోతున్నాయి. పాలకులు, అధికారులు, ప్రజలు మేల్కోకపోతే మరింత ముప్పు తప్పదు. ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. భూమిని పట్టిపీడిస్తున్న ప్రమాదకర వస్తువు ప్లాస్టిక్. 100 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని కేంద్రప్రభుత్వం నిషేధించింది. వ్యాపారులు మాత్రం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ను కొంతమంది వ్యాపారులు రోడ్డుపైనే తగులబెడుతున్నారు. దీనివల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. రెండు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో రోజుకు 150 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. లక్కిరెడ్డిపల్లె నగరపాలికలో సేకరించిన చెత్త నుంచి ఎరువు, ఇంధనం తయారుచేసే ప్రతిపాదనలు ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. జంతువులకు హానికరం: ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ఉంచి తినడం క్యాన్సర్కు దారితీస్తుందని నిపుణలు చెబుతున్నారు. మరోవైపు జంతువులకు హాని తలపెడుతోంది. కవర్లలో పండ్ల తొక్కలు, ఆహార వ్యర్థాలు ఉంచి చెత్తకుప్పలో వేస్తున్నారు. ఆవులు, పందులు వాటిని తినే క్రమంలో ప్లాస్టిక్ కాగితాలను ఆరగిస్తున్నాయి. దీంతో జీర్ణం కాక మృత్యువాత పడుతున్నాయి. ఈ కార్యక్రమంలో రామచంద్ర రావు న్యాయవాది వి చెన్న కృష్ణయ్య న్యాయవాది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక ప్రదేశాలపై పోలీసుల నిఘా



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూన్ 05 : జిల్లాలో జూన్ 4న జరిగిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసినప్పటికీ ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలలో పోలీసుల నిఘా కొనసాగుతుంది. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ



ఆదేశాలతో ఎన్నికల కౌంటింగ్ ముందు రోజు నుండి ఏర్పాటుచేసిన పోలీస్ పిక్కెట్స్ కొనసాగుతున్నాయి. ఎటువంటి ఘర్షణలు చెలరేగకుండా ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ సమస్యాత్మక ప్రాంతాలలో నిఘా ఉంచారు. గ్రామ ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎవరైనా ఘర్షణలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీస్ శాఖ తీసుకునే కఠినమైన చట్టపరమైన చర్యల గురించి వివరించి, ఎవరూ కూడా చట్టాన్ని అతిక్రమించవద్దని సూచిస్తున్నారు.

## ఆశ వర్కర్ ను వేధించిన ఏ యన్ యం ను సస్పెండ్ చేయాలి - సి ఐ టీ యు



రాయల్ జర్నలిజం ( రాయచోటి ) జూన్ 5 : రాయచోటీ టౌన్ లోని వాల్మీకి స్ట్రీట్ పిహేచ్ సి లో గత 20 సంవత్సరాలుగా ఆశా వర్కర్ గా చిత్తశుద్ధి తో పని చేస్తున్న చిట్టెమ్మ ను ఏ యన్ యం పార్వతి బాయ్ తీవ్రంగా భహిరంగంగా అందిరిముందు తీవ్ర ఆసబ్య పదజాలం తో తిట్టిన కారణంగా ఆశా వర్కర్ తీవ్ర మనస్థాపం చెంది వాస్మాయిల్ తాగి బలవన్మరణానికి పాల్పడి ప్రత్యాసుపత్రి లో చికిత్స పొందుతుండగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. మెహరున్నేశ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు జిల్లా కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి ఉపాధ్యక్షుడు ఏ వి రమణలు ఆశవర్కర్లతో కలసి ప్రభుత్వాసుపత్రి ముందు ఆశవర్కర్ కు న్యాయం జరగాలని ఏ యన్ యం ను సస్పెండ్ చేయాలని ధర్నాకు దిగారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగాఎ యన్ యం సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించిన సూపరవైజర్ కారణంగానే ఏ యన్ యం పై అధికారిననే గర్వంతో కింది స్థాయి ఆశ మీదమరింత దూషణలకు దిగిందని తెలిపారు. ధర్నా గురించి సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య ఆసుపత్రి కి వచ్చి ఆశవర్కర్ ను పరామర్శించి పూర్తి వివరాలు కనుక్కొని ఏ యన్ యం మీద చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రాజగోపాల్ రెడ్డి కి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మాధవి



రాయల్ జర్నలిజం ( లక్కీరెడ్డిపల్లి ) జూన్ 05 : ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితల్లో భాగంగా కడప నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థి మాధవిర శ్రీనివాసులు రెడ్డి అత్యధిక మెజార్టీతో కడప ఎమ్మెల్యే గా గెలుపొందిన సందర్భంగా ఈరోజు అన్నమయ్య జిల్లా లక్కీరెడ్డిపల్లి మండలంలోని వారి నివాసానికి చేరుకొని స్వర్గీయ దివంగత నేత మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కి కుటుంబ సామెతంగా నివాళ్లులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. గతంలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని జగన్ మోహన్ రెడ్డి ఎంత వేగంగా ఎగిరిపడ్డారో అంతకు మించిన వేగంతో కిందికి చతికిల పడ్డాడు. రాష్ట్రములో వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, ఇది ప్రజాస్వామ్య దేశం ప్రజలు ఏది అనుకుంటే అదే చేస్తారని ఈ ఎన్నికల్లో నిరూపణ అయిందని అన్నారు. రాయచోటి నుండి కడపకు వెళ్లి అక్కడ ఎన్నికల్లో పోటీ చేసినా కూడా మా తండ్రి గతంలో చేసిన అభివృద్ధిని, ప్రజా సేవలను గుర్తించి మమ్మల్ని నమ్మి మాపై అభిమానం చూపి మమ్మల్ని ఇక్కడ అత్యధిక మెజార్టీతో గెలిపించిన మీకు ధన్యవాదములు తెలుపుతూ.. అలాగే మా తండ్రి ఆశయాలకు అనుగుణంగా కడప నియోజకవర్గ ప్రజలకు సేవలు చేస్తూ నిత్యం వారికి అందుబాటులో ఉంటూ కడప అభివృద్ధి కోసం కృషి చేస్తామని, కడప నియోజకవర్గ ప్రజలు మాకు అందించిన ఈ నిజాయితీని మా తండ్రి కి అంకితం చేస్తున్నామని అన్నారు.

# వైసీపీ కంచుకోటను బద్దలు కొట్టిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

## మండిపల్లి విజయంతో వాడవాడలా సంబరాలు



రాయల్ జర్నలిజం ( రాయచోటి ) జూన్ 05 : గత నాలుగు పర్యాయా లుగా (2009 నుండి 2024) వరకు ఓటమి. ఎరుగని రాయచోటి నియోజకవర్గ వైసీపీ కంచుకోటను టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బద్దలు కొట్టారు. 2024 సార్వ త్రిక ఎన్నికలు మే 13న జరుగగా ఆ ఎన్నికల కౌంటింగ్ మంగళ వారం జరిగింది. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలోని 2 లక్షల 55 వేల 168 ఓట్లకు గానూ ఒక లక్షా 97 2 463 4 పోలయ్యాయి. అందులో 96 వేల 426 పురుషుల ఓట్లు పోలు కాగా, ఒక లక్షా 1031 మహిళా ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపుకు గానూ జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో మంళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగిన 21 రౌండ్ల కౌంటింగ్లో ప్రారంభం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్రెడ్డి లక్కిరెడ్డి పల్లె, రామాపురం, రాయచోటిటౌన్, రాయచోటిరూరల్ ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు సందర్భంగా సుమారు 7 వేలు పైచిలుకు మెజా ర్టీతో కొనసాగారు. అయితే మధ్యాహ్నాం అనంతరం గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె మండలాల ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగానే శ్రీకాంత్రెడ్డి మెజార్టీ క్రమేణా తగ్గుతూ 20వ రౌండు పూర్తి అయ్యేసరికి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి 871 ఓట్లతో ఆధిక్యంలోకి వచ్చారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు చేపట్ట డంతో సిట్టింగ్ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ డ్డికి 341 ఓట్లు రాగా ఉ ద్యోగస్తులంతా అత్య ధికంగా 2089 మంది టీడీపీ అభ్యర్థి రాంప్ర సాదొడ్డి వైపు మొగ్గుచూపారు. దీంతో కౌంటింగ్ పూర్తయ్యే సరికి 2655 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రారంభం నుంచి అత్యంత ఉత్కంఠ భరి తంగా సాగిన కౌంటింగ్ ప్రక్రియలో అటు అభ్యర్థులతో పాటు ఇటు ఏజెంట్లకు నరాలు తెగిపోయేంత టెన్షన్లో కౌంటింగ్ ప్రక్రియ ముగిసింది. చివరికి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజయం సాధించడంతో ఒక్కసారిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లు, అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు. దీంతో రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలో వాడవాడలా టీడీపీ నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ కేక్ కటింగులు చేసి సంబరాలు చేసుకున్నారు.

**ఇది ప్రజల విజయం**

మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటిలో తెలుగుదేశం పార్టీ విజయం నాది కాదు. ఇది నియోజకవర్గ ప్రజలందరిది అని సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అనంతరం విజయం సాధించి పార్టీ ఆఫీసు నుంచి ఆయన మీడియాతో మాట్లాడుతూ తన విజ యానికి సహకరించిన రాయచోటి నియోజకవర్గ ప్రజలకు, నాయ కులు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలి యజేశారు. తన విజయంలో ముఖ్య కారకులైన ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో జగన్ మోహన్రెడ్డి ప్రభుత్వం రాచి రంపాన పెట్టించిందని, అందుకే వారు మంచి పాలన కోసం టీడీపీని ఆద రించారని చెప్పారు. ఉ ద్యోగులు చేసిన మేలును తాను ఎప్పటికీ మరిచిపోనని, తాను అసెంబ్లీకి వెళ్లిన మొదటి రోజు ఉద్యోగస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధితో పాటు రాయ చోటి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు మరో 20 సంవత్సరాల పాటు పార్టీ బలంగా ఉండేలా పని చేస్తానన్నారు.

# నిష్క్రియత కౌరవ పాలన ముగిసింది -ఎమ్మెల్యే రామ్ ప్రసాద్ రెడ్డి



రాయల్ జర్నలిజం ( రామాపురం ) జూన్ 05 : మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి స్వగృహంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించడంతో కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే రామ్ ప్రసాద్ రెడ్డి ని, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారక నాథ్ రెడ్డి ని కలసి శుభాకాంక్షలు తెలియచేశారు,అనంతరం ఎమ్మెల్యే రామ్ ప్రసాద్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే గడి కోట ద్వారకనాథ్ రెడ్డి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో కౌరవ పాలన ముగిసింది అని అన్నారు, ఈ కౌరవ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు అని, మనందరి పాలన ప్రజాపాలన వచ్చింది అని, ఎన్డీఏ కూటమి విజయం కోసం చివరి ఓటు వేసే వరకు అన్ని అవరోధాలపై ధైర్యంగా పోరాడిన మన నాయకులు మరియు కార్యకర్తల కృషి మరియు అంకితభావం ఫలితమే ఈ గణనీయమైన విజయం. వారి అచంచలమైన నిబద్ధతకు మేము ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము మరియు ఈ అత్యుత్తమ విజయానికి అభినందనలు తెలియజేస్తున్నాము అని ఎమ్మెల్యే రామ్ ప్రసాద్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి అన్నారు.

# బి.సి.జి.టీకాతో క్షయ వ్యాధికి చెక్- డాక్టర్ శ్రీవిద్య

రాయల్ జర్నలిజం ( వాల్మీకిపురం ) జూన్ 05 : క్షయ(టి.బి)వ్యాధి లేని భారతదేశం యొక్క లక్ష్య సాధన కొరకే వయోజన బి.సి.జి.టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టినదని చింతపర్తి పి.హెచ్.సి.వైద్యులు డాక్టర్ శ్రీవిద్య అన్నారు. బుధవారం మండలం లోని విటలం, బోయపల్లి గ్రామాల్లో పెద్దల బి.సి.జి.టీకా పై అవగాహన కల్పించారు.. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో టీ.బి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా టీ బి మరణాల తీవ్రతను నివారించడంలో బీసీజీ టీకా చాలా సురక్షితమైనదని, క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి మరియు పెద్దలలో టీ.బీ నుండి రక్షణ ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజన కారి అని ఎవరు ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా వేసుకోవచ్చునని,60 సంవత్సరాలు పై బడ్డ వయస్కులు,పొగపీల్చువారు,మధుమేహ వ్యాధిగ్రస్తులు(18 సం నుండి 60 సం లోపు),టి బి జబ్బుతో కోలుకున్న వారు,వారి కుటుంబ సభ్యులకు, వీరు టీకా కు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, భానుభి, ఎమ్.ఎల్.హెచ్.పి.రెడ్డెమ్మ, ఏ.ఎన్. ఎమ్.అరుణ ఆశ కార్యకర్తలు, ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# హరిత జీవనశైలిని అలవర్చుకోవాలి



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూన్ 05 : ప్రజలందరూ పర్యావరణహితమైన జీవనశైలి అలవర్చుకుంటేనే భూగోళం మీద మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఎస్ఎం జి జూనియర్ కళాశాల లో జరిగిన కార్యక్రమంలో గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపం వల్ల రుతువులు గతితప్పడం, జీవవైవిధ్యం దెబ్బ తినడం జరుగుతుంది. ఫలితంగా వ్యాధులు పెచ్చరి ల్లుతాయి. దీనిని అరికట్టడానికి అందరం కర్బన ఉద్గారాల విడుదలను నియంత్రించడం, చెట్లను పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టవలసి ఉంది. ఇంధనాన్ని,నీటిని పొదుపుగా వాడుకోవాలి. సొంత వాహనాల వినియోగం తగ్గించి, ప్రజా రవాణాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. సహజ వనరులను కొల్లగట్టడాన్ని నివారించాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంజి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. వేదవతి, అధ్యాపకులు జాన్ సైద, ఉదయభస్కర్,లావణ్య, సునీత, రమ్య లత,సుమతి.,బేబీరాణి, లక్ష్మి తులసి, అన్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంతో అభివృద్ధి చేశా నిత్యం ప్రజలతోనే ఉన్నా

- అయినా ఓటమికి కారణం తెలియడం లేదు...
- ధనుంజయ రెడ్డి లాంటి వారి తీరు దెబ్బతీసింది.
- జిల్లా వైసిపి అధ్యక్షుడు జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం, జూన్ 5 (రాయల్ జర్నలిజం) : రాజానగరం నియోజక వర్గంలో గతంలో ఎన్నడూ లేనిరీతిలో అభివృద్ధి చేసాం. అర్హులకు పథకాల లబ్ది నేరుగా ఖాతాల్లో జమచేయించాం. అనునిత్యం ప్రజలతో మమేకమై, వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నాం. చివరకు కన్నతల్లికి ఒంట్లో బాగోలేక ఆసుపత్రిలో ఉన్నాసరే, పజలకోసం పనిచేశా. అయినా ఇంత దారుణంగా ప్రజలు ఎందుకు ఓడించారో అంతుబట్టడం లేదు" అని జిల్లా వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా వాపోయారు. స్థానిక సంహిత కన్వెన్షన్ హాలులో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో గతంలో చేసిన అభివృద్ధితో పోలిస్తే 20, 30రెట్లు అభివృద్ధి గడిచిన ఐదేళ్లలో చేశామన్నారు. 20వేల కుటుంబా లకు ఇళ్లపట్టాలు ఇచ్చామని, ఇంటి నిర్మాణానికి లోన్ కూడా మంజూరుచేయిం చామని,1773కోట్ల పైచిలుకు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని,1377 కోట్ల రూపాయలతో వివిధ సంక్షేమ పథకాలను అమలు చేశామని, అదేవిధంగా రాజానగరం మండలం కలవరిచర్ల గ్రామంలో ఇండస్ట్రీయల్ ఎస్టేట్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని,నవరత్న పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించామని ఆయన వివరించారు. కోరుకొండ సీతానగరం మండలాల్లో రెండు పంటలకు నీరు ఇచ్చాం. వ్యవసాయం చక్కగా చేసుకునేందుకు అనువైన పరిస్థితి ప్రభుత్వం కల్పించింది.విత్తనాలు, ఎరువులు, ఇన్పుట్ సబ్సిడీ, పురుగుమందులు, గోడౌన్లు, యంత్ర పరికరాలు అన్నీ అందించాం. 91ఒక కోట్ల రూపాయలతో బొబ్బిలంక తోరిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీం నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని,రూ. 25 కోట్లతో తొర్రిగడ్డ పంపిణీ స్కీం మోడరనైజ్ చేశాం. ప్రతి చిన్న ఫిర్యాదుకు స్పందించి జవాబుదారీ తనంతో పని చేశాం. నియోజకవర్గంలో లక్ష కుటుంబాలు ఉంటే 80 వేల కుటుంబాలకు వద్దకు నేనే వెళ్ళాను. నా కుటుంబ సభ్యులంతా ఎన్నో రకాల సహాయ కార్యక్రమాలు నియోజకవర్గంలో నిర్వహించాం.కాపు రిజర్వేషన్ కోసం శ్రమించిన ముద్రగడ లాంటి నాయకుడు అనేక మాటలు పడ్డారు. కాపుల కష్టాలను ఎనాడు పట్టించుకోని నాయకులు హీరోలు అయిపోయారు. గతంలో ఇదే కూటమి అధికారంలో ఉండగా చంద్రబాబు ఇచ్చిన 650హామీలు నెరవేర్చకపోయినా ప్రజలు ఇప్పుడు అదే కూటమికి పట్టం కట్టారు. మరి హామీలు చూసి ప్రజలు మోసపోయారనుకోవాలా .. ప్రజలకోసం అనునిత్యం తపిస్తూ వారికి మంచి చేయాలని చూడడం మా తప్పా అనేది తెలియడం లేదు. ప్రజల కోసం పట్టించుకోనివాళు ్ళ, తరచూ అమెరికా వెళ్లి వచ్చేవాళ్ళు వేల మెజార్టీతో నెగ్గేసారు. ఈ పరిస్థితి చూస్తే ఇంతవరకు భ్రమలో బతికామా అన్నట్టు అనిపిస్తుంది. మీకు మంచి చేసి ఉంటే నాకు ఓటు వేయమని అడిగిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్ మాత్రమే. దేశంలో ఏ



ముఖ్యమంత్రి కైనా ఇలాంటి ఈ దమ్ముందా?. గెలిచినా ఓడినా రియల్ హీరో జగన్ మాత్రమే.ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తాం. ఏదేమైనా ప్రజల కోసం పనిచేస్తాం. ప్రాణం ఉన్నంతవరకు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబంతోనే కలిసి నడుస్తాం" అని జక్కంపూడి రాజా వ్యాఖ్యానించారు. సీఎం పేషీలో ఉన్న ధనుంజయ రెడ్డి లాంటి అధికారుల తీరు కూడా తమను దెబ్బతీసిందని కోరుకొండ దేవాలయ భూముల రీరిజిస్ట్రేషన్ వంటి సమస్యల గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సరే సదరు అధికారి పట్టించుకోలేదని జక్కంపూడి రాజా ఆవేదన చెందారు.మంచి మనసుతో ఉన్న జగన్ ఇలాంటి అధికారులను నమ్మడం వలన , వాళ్ళు భ్రమలో ఉంచేశారని ఆయన అన్నారు.మొత్తం మీద ఓటమి కి గల కారణాలన్నీ విశ్లేషించుకుని ప్రజలతో మమేకమవు తామని ఆయన అన్నారు.ఆరునెలలు గడిస్తే ఇచ్చిన హామీలు ఈ ప్రభుత్వం ఎంతవరకు అమలు చేస్తుందో ప్రజలే గమనిస్తారన్నారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా నెగ్గినవారికి అభినందనలుతెలిపారు.

# అద్దంకి నియోజకవర్గ గడ్డపై ఐదోసారి పసుపు జెండా ఎగరవేసిన గొట్టిపాటి రవికుమార్

రాయల్ జర్నలిజం ( జే పంగులూరు ) జూన్ 05 : అవరోధాలు దాటుకొని ప్రజల మనసులు గెలుచుకొని ఐదోసారి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నాడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ఐదుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైక వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు నియోజకవర్గం లో పసుపు జెండా ఎగరవేయటం పై గొట్టిపాటి రవికుమార్ చూపించిన తెగువ మరవకున్నారు ప్రజాసేవలో ఎప్పుడు ముందు ఉండే నాయకుడిగా నియోజకవర్గంలోనే పేరుగాంచారు ఏ మండలంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా నేను ఉండాలంటూ ప్రజాసేవలో తనకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేయించుకున్నారు అద్దంకి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పార్టీ బలోపేతం కోసం ఆయనచేసిన కృషి మరవలేని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా నాయకుడిగా నియోజకవర్గంలో నే మంచి పేరు తెచ్చుకున్నారు గొట్టిపాటి రవికుమార్ ఐదవ విజయంతో నియోజకవర్గం వ్యాప్తంగా పండగ వాతావరణం ఏర్పడింది నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మండల కేంద్రాల్లో కార్యకర్తల అభిమానులు కేకులు కోసి మిఠాయిల. పంచి పెట్టుకున్నారు బాన సామాగ్రి టపాసులుకాల్చి అందరూసంబరాలు చేసుకున్నారు.

# చారిత్రాత్మక విజయం అందించిన గాజువాక నియోజకవర్గం ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన టిడిపి శ్రేణులు

విశాఖపట్నం, జూన్ 5 (రాయల్ జర్నలిజం) : రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గాజువాక ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావును నెగ్గించినందుకు పల్లా శ్రీనివాస్ టిడిపి శ్రేణులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం పాత గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడిపి శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు శాసన సభ్యులుగా రాష్ట్రంలోనే ఇద్దరు నాయకులు అత్యధిక మెజారిటీతో విజయం సాధించడం, మతుకుమిల్లి శ్రీభరత్ విశాఖ పార్లమెంట్ సభ్యులుగా విజయం సాధించడంతో విజయోత్సవ సంబరాలు అత్యంత వైభవపేతంగా జరుపుకున్నారు. గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇద్దరు నాయకులు అత్యధిక మెజారిటీతో చారిత్రాత్మక విజయాన్ని అందించిన గాజువాక నియోజకవర్గ ప్రజలకు, పల్లా అభిమానులకు, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అలాగే తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతాభివందనములు తెలియజేశారు. గత ఐదు సంవత్సరాలుగా ఒక నియంత, అరాచక శక్తి, అవినీతి పరుడు,



ఆర్థిక ఉగ్రవాదుల పాలనలో అన్ని వర్గాల వారు విసిగి వేసారిన రాష్ట్ర ప్రజలకు ఈ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వారి ఓటు అనే ఒక వజ్రాయుధంతో వైసిపిని, వైసిపి నాయకులను, పాలకులను చీల్చి చెండాడారని అన్నారు. వీరి తిరోగమన పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలో నెట్టారని అన్నారు. అలాగే టీడిపి వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ యన్టీఆర్ అన్నట్టుగా సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు, పాలకులు అంటే సేవకులు అన్నట్టుగా వారి ఆశయ సాధనలో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సుస్థిరమైన, సుపరిపాలనను అందిస్తూ అభివృద్ధి సంక్షేమంతో ఆంధ్ర రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు టీడీపీ కార్పొరేటర్ బోండా జగన్, 67వ వార్డు టిడిపి కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, పల్లా పెంటారావు, రాష్ట్ర టిఎన్టియుసి నాయకులు విల్లా రామ్మోహన్, జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు తమ్మిన విజయ్ కుమార్, గాజువాక నియోజకవర్గ టీడీపీ బీసీ విభాగం అధ్యక్షులు తమిరే శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, బైపిల్లి గాంధీ, రాజాన రాజు, సింగూరి ఆనంత్, గోమాడా వాసు, రట్టి వాసు, అంగ కృష్ణ, దాట్ల శ్రీవాసరాజు, కళ్లేపల్లి శ్రీనివాస వర్మ, చిట్టీబాబు, రట్టి సంతోష్, మహిళా నాయకులు పోలవరపు జ్యోతి, జనసేన మహిళా నాయకురాలు షాలిని, వరలక్ష్మి, నామాల శ్రీకాంత్ తదితర కూటమి పార్టీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పర్చూరు గడ్డపై మూడోసారి పసుపు జెండా ఎగరవేసిన ఏలూరి

రాయల్ జర్నలిజం (కారంచేడు) జూన్ 05 : పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని సాధించడం ఓ ప్రత్యేకతను చాటుకుంది. ఉద్దండులు కోటగా పేరుగాంచిన పర్చూరు పై వరుసగా మూడోసారి పసుపు జెండా ఎగరవేయడంపై ఏలూరి చూపిన తెగువ మరవకున్నారు. ప్రజా సేవలో ఎప్పుడూ ముందు ఉండే నాయకుడిగా జిల్లాలోనే పేరుగాంచారు పర్చూరు నియోజకవర్గంలో కొన్ని వేల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు మరియు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజాసేవలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. బాపట్ల నియోజకవర్గం అధ్యక్షుడిగా జిల్లాలో పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన కృషి మరువలేని. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజానాయకుడిగా జిల్లాలోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఏలూరి హ్యాట్రిక్ విజయంతో పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా పండగ వాతావరణం ఏర్పడింది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో మండల కేంద్రాలలో కార్యకర్తలు అభిమానులు కేకులు కోసి మిఠాయిలు పంచి పెట్టారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# జగన్ పై వ్యతిరేకత, బాబు పై నమ్మకమే ఈ ఫలితాలు

కాకినాడ రూరల్,, జూన్ 5 (రాయల్ జర్నలిజం) : ఒక దుర్మార్గుడైన జగన్ ను గద్దె దించటానికి ప్రజలందరూ తమ ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించారని స్వాతంత్రం వచ్చిన తరవాత ఈ స్థాయి ఫలితాలు గతంలో ఎప్పుడూ చూడలేదని ప్రజల్ని ఇబ్బందులు పెడితే వారు ఇచ్చే తీర్పు ఎలా ఉంటుందో మొన్నటి ఫలితాలు బట్టబయలు చేశాయని, తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి చెప్పారు. ఎన్నికల ఫలితాలు పై బుదవారం ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తో, పార్టీ క్యాడర్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి విజయానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ కృత్షతలు తెలిపారు. రూరల్ నియోజక వర్గంలో సీటు పొత్తులో భాగంగా జనసేన కు రావటం వలన పార్టీ శ్రేణులలో కొద్దిగా అసహనం ఉన్నా అందరినీ ఏకతాటిపై తీసుకువచ్చి కూటమి అభ్యర్థి పంతం నానాజీ గెలుపు కృషి చేశామన్నారు. 2019 అధికారం దూరం అయిన నాటినుండి ఈ ఎన్నికల వరకు తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు అన్ని పార్టీ కార్యక్రమాలు చేశామని,పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళమన్నారు. సైకిల్ గుర్తు లేకుండా ఎలా వెళ్ళాలి అని మదన పడ్డమని తరువాత ఒక ప్రణాళిక ప్రకారం ప్రజల్లోకి వెళ్ళి ఉ



మ్మడి అభ్యర్థి గెలుపుకు కృషి చేశామన్నారు. కార్యకర్తల్లో చిన్న చిన్న అభిప్రాయ బేధాలు ఉన్నా అవన్నీ సరి చేశామని,పొత్తులో భాగంగా రాష్టలో 31సీట్లు ఇస్తే కాకినాడ రూరల్ ల్లో చేసినట్టు మరెక్కడా చేసి ఉండరు సీనియర్ నాయకుడు నుండి కార్యకర్త వరకు అందరూ కష్టపడ్డామని ,కొంతమంది వక్రీకరిక్రించినా మేము నిబద్ధతతో పని చేశామన్నారు.మేము పార్టీ మారిపోతున్నమని అనేక వార్తలు రాసినా మేము చలించలేదని ఉమ్మడి సమిష్టి కృషి తో 72 వేలు పైచిలుకు మెజార్టీ వచ్చిందన్నారు.ప్రజలు తో మేము ఉన్నాం కాబట్టి ప్రజలు ఈ తీర్పు ఇచ్చారనీ, అత్యధిక మెజార్టీ వచ్చేలా కష్టపడ్డ కార్యకర్తలు మనో భావాలు దెబ్బ తినకుండా రానున్న రోజుల్లో పార్టీ చూస్తోందన్నారు. ఈ గెలుపు ప్రజలదని ఇంతటి ఘనవిజయాన్ని ఇచ్చిన ప్రజల వద్దకు త్వరలోనే వెళ్ళి కృతజ్ఞతలు తెలుపుతామన్నారు .కాకినాడ రూరల్ నియోజక వర్గంలో గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. ఎంఎల్ఏ నానాజీ సంయుక్తంగా వెళ్ళి ప్రజల అవసరాలు తీర్చటానికి కృషి చేస్తామన్నారు. కూటమిలో ఉన్న భారతీయ జనతా పార్టీ కేంద్రంలో మళ్ళీ అధికారంలోకి ఉందని కేంద్ర సహకరం తో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు చంద్రబాబు నడిపిస్తారని అన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబులు ప్రజలకు మేలు చేశాలా పరిపాలన చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రి వెంకటరాజు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దాయన రాంప్రసాద్, కాళ్ళ శ్రీను, మిరపల ప్రకాష్, యాళ్ల రాజా, పడమటి వీరబాబు, చల్మాజీ, కేశబోయిన ఏడుకొండలు, చిల్లపల్లి గణపతి, చాట్రాతి సాయిబాబా, పిల్లి విజయ్ గోపాల్, పాలిక ఉషారాణి, బొజ్జ భవాని సాంబశివరావు, పలివెల గాయత్రి, గుత్తుల లక్ష్మీ, పిల్లి రామకృష్ణ, వాసంశెట్టి అంజిబాబు, పంపన బుజ్జి, మాతా లక్ష్మణ్, గుబ్బల సత్తిబాబు, కుమిరిశెట్టి నరసింగరావు, వీరగని వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, ఎలగా అవరాజు, కాకరపల్లి శ్యామ్, కోడి సీతారామయ్య, పాల్గొన్నారు.

# ఎంతో అభివృద్ధి చేశా నిత్యం ప్రజలతోనే ఉన్నా

- అయినా ఓటమికి కారణం తెలియడం లేదు...
- ధనుంజయ రెడ్డి లాంటి వారి తీరు దెబ్బతీసింది.
- జిల్లా వైసిపి అధ్యక్షుడు జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం, జూన్ 5 (రాయల్ జర్నలిజం) : రాజానగరం నియోజక వర్గంలో గతంలో ఎన్నడూ లేనిరీతిలో అభివృద్ధి చేసాం. అర్హులకు పథకాల లబ్ది నేరుగా ఖాతాల్లో జమచేయించాం. అనునిత్యం ప్రజలతో మమేకమై, వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నాం. చివరకు కన్నతల్లికి ఒంట్లో బాగోలేక ఆసుపత్రిలో ఉన్నాసరే, పజలకోసం పనిచేశా. అయినా ఇంత దారుణంగా ప్రజలు ఎందుకు ఓడించారో అంతుబట్టడం లేదు" అని జిల్లా వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా వాపోయారు. స్థానిక సంహిత కన్వెన్షన్ హాలులో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో గతంలో చేసిన అభివృద్ధితో పోలిస్తే 20, 30రెట్లు అభివృద్ధి గడిచిన ఐదేళ్లలో చేశామన్నారు. 20వేల కుటుంబా లకు ఇళ్లపట్టాలు ఇచ్చామని, ఇంటి నిర్మాణానికి లోన్ కూడా మంజూరుచేయించామని,1773కోట్ల పైచిలుకు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని,1377 కోట్ల రూపాయలతో వివిధ సంక్షేమ పథకాలను అమలు చేశామని, అదేవిధంగా రాజానగరం మండలం కలవరిచర్ల గ్రామంలో ఇండస్ట్రీయల్ ఎస్టేట్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని,నవరత్న పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించామని ఆయన వివరించారు. కోరుకొండ సీతానగరం మండలాల్లో రెండు పంటలకు నీరు ఇచ్చాం. వ్యవసాయం చక్కగా చేసుకునేందుకు అనువైన పరిస్థితి ప్రభుత్వం కల్పించింది. విత్తనాలు, ఎరువులు, ఇన్పుట్ సబ్సిడీ, పురుగుమందులు, గోడౌన్లు, యంత్ర పరికరాలు అన్నీ అందించాం. 91ఒక కోట్ల రూపాయలతో బొబ్బిలంక తొరిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీం నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని,రూ. 25 కోట్లతో తొర్రిగడ్డ పంపిణీ స్కీం మోడరనైజ్ చేశాం. ప్రతి చిన్న ఫిర్యాదుకు స్పందించి జవాబుదారీ తనంతో పని చేశాం. నియోజకవర్గంలో లక్ష కుటుంబాలు ఉంటే 80 వేల కుటుంబాలకు వద్దకు నేనే వెళ్ళాను. నా కుటుంబ సభ్యులంతా ఎన్నో రకాల సహాయ కార్యక్రమాలు నియోజకవర్గంలో నిర్వహించాం. కాపు రిజర్వేషన్ కోసం శ్రమించిన ముద్రగడ లాంటి నాయకుడు అనేక మాటలు పడ్డారు. కాపుల కష్టాలను ఎనాడు పట్టించుకోని నాయకులు హీరోలు అయిపోయారు. గతంలో ఇదే కూటమి అధికారంలో ఉండగా చంద్రబాబు ఇచ్చిన 650హామీలు నెరవేర్చకపోయినా ప్రజలు ఇప్పుడు అదే కూటమికి పట్టం కట్టారు. మరి హామీలు చూసి ప్రజలు మోసాపోయారనుకోవాలా .. ప్రజలకోసం అనునిత్యం తపిస్తూ వారికి మంచి చేయాలని చూడడం మా తప్పా అనేది తెలియడం లేదు. ప్రజల కోసం పట్టించుకోనివాళు ్ళ, తరచూ అమెరికా వెళ్లి వచ్చేవాళ్ళు వేల మెజార్టీతో నెగ్గేసారు. ఈ పరిస్థితి చూస్తే ఇంతవరకు భ్రమలో బతికామా అన్నట్టు అనిపిస్తుంది. మీకు మంచి చేసి ఉంటే నాకు ఓటు వేయమని అడిగిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్ మాత్రమే. దేశంలో ఏ



ముఖ్యమంత్రి కైనా ఇలాంటి ఈ దమ్ముందా?. గెలిచినా ఓడినా రియల్ హీరో జగన్ మాత్రమే.ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తాం. ఏదేమైనా ప్రజల కోసం పనిచేస్తాం. ప్రాణం ఉన్నంతవరకు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబంతోనే కలిసి నడుస్తాం" అని జక్కంపూడి రాజా వ్యాఖ్యానించారు. సీఎం పేషీలో ఉన్న ధనుంజయ రెడ్డి లాంటి అధికారుల తీరు కూడా తమను దెబ్బతీసిందని కోరుకొండ దేవాలయ భూముల రీరిజిస్ట్రేషన్ వంటి సమస్యల గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సరే సదరు అధికారి పట్టించుకోలేదని జక్కంపూడి రాజా ఆవేదన చెందారు.మంచి మనసుతో ఉన్న జగన్ ఇలాంటి అధికారులను నమ్మడం వలన , వాళ్ళు భ్రమలో ఉంచేశారని ఆయన అన్నారు.మొత్తం మీద ఓటమి కి గల కారణాలన్నీ విశ్లేషించుకుని ప్రజలతో మమేకమవుతామని ఆయన అన్నారు.ఆరునెలలు గడిస్తే ఇచ్చిన హామీలు ఈ ప్రభుత్వం ఎంతవరకు అమలు చేస్తుందో ప్రజలే గమనిస్తారన్నారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా నెగ్గినవారికి అభినందనలుతెలిపారు.

# చారిత్రాత్మక విజయం అందించిన గాజువాక నియోజకవర్గం ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన టిడిపి శ్రేణులు

విశాఖపట్నం, జూన్ 5 (రాయల్ జర్నలిజం) : రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గాజువాక ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావును నెగ్గించినందుకు పల్లా శ్రీనివాస్ టిడిపి శ్రేణులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం పాత గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడిపి శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు శాసన సభ్యులుగా రాష్ట్రంలోనే ఇద్దరు నాయకులు అత్యధిక మెజారిటీతో విజయం సాధించడం, మతుకుమిల్లి శ్రీభరత్ విశాఖ పార్లమెంట్ సభ్యులుగా విజయం సాధించడంతో విజయోత్సవ సంబరాలు అత్యంత వైభవపేతంగా జరుపుకున్నారు. గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇద్దరు నాయకులు అత్యధిక మెజారిటీతో చారిత్రాత్మక విజయాన్ని అందించిన గాజువాక నియోజకవర్గ ప్రజలకు, పల్లా అభిమానులకు, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అలాగే తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతాభివందనములు తెలియజేశారు. గత ఐదు సంవత్సరాలుగా ఒక నియంత, అరాచక శక్తీ, అవినీతి పరుడు, ఆర్థిక ఉగ్రవాదుల పాలనలో అన్ని వర్గాల వారు విసిగి వేసారిన



రాష్ట్ర ప్రజలకు ఈ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వారి ఓటు అనే ఒక వజ్రాయుధంతో వైసిపిని, వైసిపి నాయకులను, పాలకులను చీల్చి చెండాడారని అన్నారు. వీరి తిరోగమన పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలో నెట్టారని అన్నారు. అలాగే టీడిపి వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ యన్టీఆర్ అన్నట్టుగా సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు, పాలకులు అంటే సేవకులు అన్నట్టుగా వారి ఆశయ సాధనలో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సుస్థిరమైన, సుపరిపాలనను అందిస్తూ అభివృద్ధి సంక్షేమంతో ఆంధ్ర రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు టీడీపీ కార్పొరేటర్ బోండా జగన్, 67వ వార్డు టిడిపి కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, పల్లా పెంటారావు, రాష్ట్ర టిఎన్టియుసి నాయకులు విల్లా రామ్మోహన్, జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు తమ్మిన విజయ్ కుమార్, గాజువాక నియోజకవర్గ టీడీపీ బీసీ విభాగం అధ్యక్షులు తమిరే శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, బైపిల్లి గాంధీ, రాజాన రాజు, సింగూరి ఆనంత్, గోమాడా వాసు, రట్టి వాసు, అంగ కృష్ణ, దాట్ల శ్రీవాసరాజు, కళ్లేపల్లి శ్రీనివాస వర్మ, చిట్టీబాబు, రట్టి సంతోష్, మహిళా నాయకులు పోలవరపు జ్యోతి, జనసేన మహిళా నాయకురాలు షాలిని, వరలక్ష్మి, నామాల శ్రీకాంత్ తదితర కూటమి పార్టీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

–సివంగి నాగేశ్వరరావు, విశాఖ జిల్లా 'కోస్తా సమయం' ప్రతినిధి

# 20న ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలు



రాజమహేంద్రవరం, జూన్ 5 (రాయల్ జర్నలిజం) : వచ్చే నెల జూలై 20వ తేదీన ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు జరుపుటకు నిర్ణయిస్తూ జిల్లా కలెక్టర్ కె. మాధవి లత బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల అధికారిగా కొవ్వూరు డివిజనల్ సహకార అధికారి వి. కృష్ణ కాంత్ నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూలు కూడా విడుదల చేశారు. జూలై 11న నామినేషన్లు, 13న ఉపసంహరణ, 20న ఎన్నికలు నిర్వహిస్తారు. అర్హత గల ఓటర్ల జాబితాను తయారుచేసి నాలుగో తేదీన తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని ఎన్నికల అధికారి కృష్ణ కాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్నికల సామాగ్రిని సక్రమంగా భద్రపరచాలి

కాకినాడ, జూన్ 5 (రాయల్ జర్నలిజం) :సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణలో భాగంగా వినియోగించిన ఈవీఎం, వీవీప్యాట్స్, ఇతర ఎన్నికల సామాగ్రిని సక్రమంగా భద్రపరచాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కాకినాడ జిల్లాలో సక్రమంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తికావడంతో అధికారులు ఎన్నికల సామాగ్రిని భద్రపరిచే ప్రక్రియ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం కాకినాడ జేఎన్టీయూలో ఉన్న ఈవీఎంలు, వీవీప్యాట్స్, ఇతర ఎన్నికల సామాగ్రిని ఆయన నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో తరలిస్తున్న ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్..జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ పక్కన ఉన్న ఈవీఎం గోదాంలో భద్రపరుస్తున్న ఈవీఎంలు, వీవీప్యాట్ లను, జిల్లా ఖజానా కార్యాలయంలో భద్రపరుస్తున్న ఇతర ఎన్నికల సామాగ్రిని ఆయన..జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తైన అనంతరం ఎన్నికల సామాగ్రిని జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల



సమక్షంలో సురక్షితంగా భద్రపరచడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నికల సామాగ్రి అంతటిని సక్రమంగా భద్రపరచాలన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్ లను కలెక్టరేట్ పక్కన ఉన్న ఈవీఎం గోదాంలో ఆయా నియోజకవర్గాల వారిగా భద్రపరచాలన్నారు. అదేవిధంగా ఇతర ఎన్నికల సామాగ్రిని జిల్లా ఖజానా కార్యాలయంలో భద్రపరచాలన్ని ఆయన అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పే నాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక హెూదా కాంగ్రెస్ తోనే సాధ్యం




మండపేట, జూన్ 5 (రాయల్ జర్నలిజం) : ఈ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కామన ప్రభాకర్ రావు పేర్కొన్నారు.మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుదవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సహకరించాలనీ కూటమి నాయకులకు విజ్ఞప్తి చేశారు.కూటమి కాంగ్రెస్ తో చేతులు కలపాలన్నారు.ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు ఈ రెండు కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని పేర్కొన్నారు.కాంగ్రెస్ కు మద్దతు ఇస్తే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు. నెగ్గినఎమ్మెల్యేలకు చేతులెత్తి మొక్కుతున్నానని పేర్కొన్నారు.కాంగ్రెస్ తో కలిసేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.బీజేపీ కి కావలసినంత మెజారిటీ రాని పరిస్థితుల్లో కూటమి నాయకులు కాంగ్రెస్ పార్టీ తో జత కట్టి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. 2014 లో రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తానని చెప్పి చంద్రబాబును మోడీ మోసం చేశారన్నారు. ప్రత్యేక హెూదా కి బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చాడన్నారు. అప్పుడు మోడీకి కావలసినంత మెజారిటీ వుండటం తోనే ఇలా చేశారన్నారు. మరోసారి అతనిని నమ్మి చరిత్ర హీనులుగా మిగలవద్దన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ మాట్లాడుతూ చంద్రబాబు, నితీష్ లు తమ స్నేహితులేనని చెప్పరన్నారు .రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లు ఇందుకు తగిన ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇంకో వైపు టీడీపీ, జన సేన పార్టీ ఎమ్మెల్యేలు అంతా కాంగ్రెస్ తో జతకట్టేందుకు అధినాయకులపై తగిన ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ విషయంలో ప్రతి ఎమ్మెల్యేకు తాను చేతులెత్తి మొక్కుతున్నట్లు చెప్పారు. ఈ రాష్ట్రాభివృద్ధి కోసం కొన్ని త్యాగాలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కొడవళ్ళ వెంకట సుబ్బారావు, నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మగ్గం జాకబ్ రాజబాబు, పార్టీ నేతలు వల్లభ దాసు వీర వెంకట సత్యనారాయణ, కామన ఆదిబాబు పాల్గొన్నారు.

# రంపచోడవరం ఎమ్మెల్యేగా మిరియాల శిరీష



రాజవొమ్మంగి, జూన్ 5 (రాయల్ జర్నలిజం): రాజవొమ్మంగి మండలం అనంతగిరి గ్రామానికి చెందిన మిరియాల శిరీష దేవి (తెలుగుదేశం కూటమి అభ్యర్థి) రంపచోడవరం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈమె విజయం సాధించారు. అంగనవాడి టీచర్ నుండి ఎమ్మెల్యే స్థాయికి వచ్చిన శిరీష దేవిని తెలుగుదేశం పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి




కాకినాడ, జూన్ 5 (రాయల్ జర్నలిజం) :పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని లేని పక్షంలో రానున్న కాలంలో మానవ, జీవరాశులు మరింత ప్రమాదంలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు పర్యావరణ వేత్తలు తమ అభిప్రాయంలను వ్యక్తం చేశారు. బుధవారం కాకినాడ ప్రాంతంలోని కోరంగిలో ఉన్న మడ అడవిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ భరణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పర్యావరణ శాఖ, అటవీ శాఖలు ఎంతో కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి పర్యావరణంను ఆస్వాదించి ఏ విధంగా రక్షించుకోవాలో తెలుసుకోవాలని భరణి సూచించారు. పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ(సత్య ) మాట్లాడుతూ నదులు వెళ్లి సముద్రంలో కలిసిన చోటనే మడ చెట్టు జీవిస్తుందని అందువల్ల మడ అడవులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఎక్కువగా కార్బన్ తీసుకొన ఆక్సీజన్ విడుదల చేసి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రకృతిని పరిరక్షించుకోవాలని చెట్టు, నీరు నిరంతరం కాపాడుకోవాలని బొలిశెట్టి కోరారు. ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. నేషనల్ ఎన్విరాన్మెంట్ డైరెక్టర్ చిలుకూరి రామ్ కుమార్ మాట్లాడుతూ కాకినాడలో కోన ప్రాంత ఏరియాలో పచ్చదనం చాలా తక్కువ ఉందని దానిపై దృష్టి పెట్టి అక్కడ పర్యావరణకు పాటు పడాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాకినాడ పోర్ట్ ఆఫీసర్ ధర్మశాస్త్ర, ఎస్డిఎఫ్ఓ టి అనూష, ఎఫ్ఆర్ఓ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, పెసింగి ఆదినారాయణ, పిల్లారిశెట్టి రాజేశ్వరి, దుగ్గన బాబ్జి, డాక్టర్ కిరణ్, ఆకుల శ్రీనివాస్, ఆట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఓటమిపై ఎట్టకేలకు నోరు విప్పిన ఐప్యాక్

అమరావతి : రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాన్ని చవి చూసింది. అటు అసెంబ్లీ, ఇటు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు దారుణంగా ఓడిపోయారు. 175 అసెంబ్లీ స్థానాలకు గాను వైఎస్ఆర్సీపీకి దక్కింది.. పట్టుమని 11 స్థానాలే. కంచుకోటల్లాంటి నియోజకవర్గాలను వైఎస్ఆర్సీపీ కోల్పోయింది. విశాఖపట్నం– 2, చిత్తూరు–2, కడప– 3, కర్నూలు– 2, ప్రకాశం– 2.. ఇవీ ఆ పార్టీ అభ్యర్థులు గెలిచిన నియోజకవర్గాల సంఖ్య. అటు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ ఇవే ఫలితాలు కనిపించాయి. నాలుగు చోట్ల మాత్రమే గెలిచింది వైఎస్ఆర్సీపీ. 2019 నాటి ఎన్నికల్లో టీడీపీకి లభించిన సీట్ల కంటే కూడా దారుణ పరాజయాన్ని చవి చూసింది. ఆ ఎన్నికల్లో 23 సీట్లను దక్కించుకుంది టీడీపీ. ఇప్పుడు పట్టుమని పది సీట్లకు మాత్రమే పరిమితం కావడం వైసీపీ దీనస్థితికి అద్దం పట్టినట్టయింది. అయిదు సంవత్సరాలు తిరిగే సరికి వైఎస్ఆర్సీపీ పరిస్థితి అంతకంటే దారుణంగా మారడం ఓటర్లల్లో ఆ పార్టీ పట్ల ఉన్న వ్యతిరేకతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ ఓటమిని వైఎస్ జగన్ అంగీకరించారు. ఫలితాలు వెలువడిన రోజు సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పోరాటం తమకు కొత్త కాదని, ప్రజల తరఫున పోరాడుతామని పేర్కొన్నారు. వాయిస్ ఆఫ్ వాయిస్ లెస్‌గా ఉంటామని, పేద ప్రజల పక్షాన పోరాటం సాగిస్తామనీ అన్నారు. అనంతరం తన పదవికి రాజీనామా చేశారు. ఈ ఎన్నికల్లో కూడా వైఎస్ఆర్సీపీ పొలిటికల్ స్ట్రాటజిస్ట్‌గా వ్యవహరించింది ఐప్యాక్. 2019 నాటి ఎన్నికల్లో 151 సీట్లతో తిరుగులేని విజయం సాధించడం వెనుక ఈ సంస్థ వ్యూహాలు ఉన్నాయనేది బహిరంగ రహస్యమే. కిందటి నెల 13వ పోలింగ్ ముగిసిన తరువాత జగన్ స్వయంగా ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి, వారిని అభినందించారు కూడా. కాగా– ఈ ఓటమిపై ఐప్యాక్ స్పందించింది. వైఎస్ఆర్సీపీతో కలిసి మరోసారి పని చేయడానికి 2024 ఎన్నికలు తమకు మంచి అవకాశాన్ని ఇచ్చాయని వ్యాఖ్యానించింది. పార్టీని వరుసగా రెండోసారి అధికారంలోకి తీసుకుని రావడానికి చెక్కు చెదరని సంకల్ప దీక్షతో ఈ ఎన్నికల్లో పని చేశామని పేర్కొంది. ఫలితం ఎలా ఉన్నప్పటికీ– వైఎస్ జగన్ నాయకత్వం తమకు ఓ స్ఫూర్తిగా నిలిచిపోతుందని తెలిపింది.

# ఇది సవాలంటే... పద్మనాభరెడ్డిగా మారనున్న ముద్రగడ !

అమరావతి :అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో.... సంచలన నిర్ణయం తీసుకున్నారు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం. ముందుగా చెప్పినట్టుగానే... పేరు మార్చుకుంటానని. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. తన పేరును ముద్రగడ పద్మనాభరెడ్డి గా మార్చుకునేందుకు... గెజిట్ పబ్లికేషన్ కోసం పేపర్లు కూడా రెడీ చేసుకున్నట్లు తాజాగా ముద్రగడ పద్మనాభం ప్రకటించారు. తన పేరు మార్చుకునేందుకు అవసరమైన అన్ని.. పేపర్లను సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ విజయం సాధించారు. 72 వేల పై చిలుకు మెజారిటీతో వైసిపి అభ్యర్థి వంగ గీతాపై ఘనవిజయం సాధించారు జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. అయితే పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బరిలో దిగిన సమయంలో... ఓ పెను సంచలన సవాల్ విసిరారు ముద్రగడ పద్మనాభం. పిఠాపురం నియోజకవర్గం నుంచి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గెలిస్తే... తన పేరు మార్చుకుంటాను అని శపథం చేశారు ముద్రగడ పద్మనాభం. అయితే... మంగళవారం రిలీజ్ అయిన ఫలితాలలో పవన్ కళ్యాణ్ విజయం సాధించారు. దీంతో ముందుగా చెప్పినట్లుగానే... తన సవాలు స్వీకరిస్తున్నారు ముద్రగడ పద్మనాభం. ముందుగా చెప్పినట్లు తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటాను అని ఆయన వెల్లడించారు. సవాల్ లో తాను ఓడిపోయానని...అందుకే.. నా పేరు మార్చుకునేందుకు సిద్ధమయ్యాను అంటూ సంచలన ప్రకటన చేశారు ముద్రగడ పద్మనాభం. పవన్ కళ్యాణ్ కు గెలిచినందుకు గాను శుభాకాంక్షలు కూడా తెలిపారు. అలాగే జగన్ మోహన్ రెడ్డి ఓటమిపై స్పందించారు ముద్రగడ. జగన్మోహన్ రెడ్డి కోసం కష్టపడ్డ వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ ప్రజలకు మంచి చేసిన జగన్మోహన్ రెడ్డి ఓడిపోవడం... చాలా బాధ కలిగించిందన్నారు. ఇకపై తన ప్రయాణం జగన్మోహన్ రెడ్డి తోనే ఉంటుందని వివరించారు. జగన్మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు... అద్భుతంగా ఉన్నాయని... కానీ ఏపీ ప్రజలు కూటమికి మొగ్గు చూపినట్లు తెలిపారు.

# సౌత్ నుంచి ఇండియా ప్రధాని?



న్యూఢిల్లీ : దేశంలో రాజకీయ పరిణామలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. ప్రత్యేకించి– కేంద్రంలో ఎవరు అధికారంలోకి వస్తారనేది చర్చనీయాంశమౌతోంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని ఎన్డీఏకు బొటాబొటి మెజారిటీ సీట్లు లభించడం, ఓట్ల లెక్కింపు తరువాత కూటమిలో లుకలుకలు ఏర్పడటం శరవేగంగా సాగిపోయాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్డీఏ సంకీర్ణ కూటమికి 292కి కాస్త అటు ఇటుగా ఉంటోన్నాయి. 400లకు పైగా సీట్లను సాధిస్తామంటూ లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో ధీమాగా చెప్పిన బీజేపీ నాయకులు.. ఓట్ల లెక్కింపు సందర్భంగా వెలువడిన ఫలితాలతో డీలా పడ్డారు. బీజేపీకి అత్యంత బలమైన ఉత్తరప్రదేశ్‌లో సైతం ఉమ్మడి ప్రతిపక్షాల కూటమి ఇండియా హవా వీచింది. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమికి 234 స్థానాలు లభించాయి. ఇతరులు 17 చోట్ల గెలిచారు. అయినప్పటికీ– ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్‌ను ప్రస్తుతానికి అందుకోలేకపోయిందీ ఇండియా అలయెన్స్. అదే సమయంలో ఎన్డీఏకు ఈ అవకాశం లభించింది. ఈ క్రమంలో ఎన్డీఏ కూటమిలో కీలకంగా ఉన్న జనతాదళ్ (యునైటెడ్) అధినేత, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు గాలం వేశారు ఇండియా కూటమి నాయకులు. ఆయనను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు మొదలుపెట్టారు. తమకు మద్దతు ఇస్తే కీలక పదవి ఇస్తామంటూ హామీలను ఇస్తోన్నారు. ఈ నేపథ్యంలో ఈ సాయంత్రం ఇండియా కూటమి నాయకులు సమావేశం కానున్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధినేత మల్లికార్జున్ ఖర్గే నివాసంలో ఈ భేటీ జరగనుంది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, శరద్ పవార్, ఉద్ధవ్ థాకరే, డీ రాజా, సీతారాం ఏచూరి, చంపై సోరెన్, ఫరూక్ అబ్దుల్లా.. వంటి నాయకులు దీనికి హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలా? వద్దా? అనే విషయంపై నిర్ణయం తీసుకుంటారిందులో. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లను దక్కించుకోవాలి? తమకు మద్దతు ఇవ్వడం అంటూ జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి గానీ, జనతాదళ్ (యునైటెడ్) చీఫ్ నితీష్ కుమార్‌కు గానీ ఎలాంటి ఆఫర్లు ఇవ్వాలనేది ఇందులో తేల్చుతారు. అదే సమయంలో– ప్రధానమంత్రిగా ఎవరు ఉండాలనే అంశంపైనా ఓ నిర్ణయానికి వస్తారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్న తరువాతే ప్రధాని అభ్యర్థి పేరును నిర్ణయించాలని కాంగ్రెస్ ఇప్పటికే తీర్మానించుకుంది. ఆ అవకాశమే లభిస్తే– దక్షిణాది నుంచి ప్రధాని అభ్యర్థిని ఎంపిక చేయవచ్చనే ప్రచారం ఢిల్లీలో జోరుగా సాగుతోంది.


# వైసీపీ ఎందుకు ఓడిపోయిందో అర్థం కావడం లేదు - కేతిరెడ్డి



అమరావతి : వైసీపీ ఎందుకు ఓడిపోయిందో అర్థం కావడం లేదన్నారు కేతిరెడ్డి. ధర్మవరం వైసీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తన ఓటమిపై భావోద్వేగ పోస్ట్ చేశారు. తాను, వైసిపి పార్టీ ఏ కారణంతో ఓడిపోయామో అంతు పట్టడం లేదన్నారు. నాన్–లోకల్ వ్యక్తి అయిన సత్యకుమార్ గెలుపొందడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. 'ఈ ఫలితాలు చూస్తుంటే బాధ కలుగుతోంది. నిజాయితీగా ఉంటే సరిపోదు అనుకుంటా. అబద్ధాలు నేను ఆడ లేకపోయాను. ఇది దురదృష్టకరం' అని పేర్కొన్నారు. కాగా, 'వైనాట్ 175'.. ఎన్నికలకు కొన్ని నెలల ముందు నుంచే వైసీపీ అధినేత జగన్ ఈ స్లోగన్ అందుకున్నారు. 2019లో 151 సీట్లు గెలిచామని. ఈసారి కుప్పంతో సహా రాష్ట్రంలోని 175కి 175 స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కానీ రియాలిటీ జగన్ అంచనాలకు చాలా భిన్నంగా ఉంది. మొత్తం 175 సీట్లలో వైసీపీ కేవలం 11 స్థానాల్లోనే గెలిచింది. జగన్ ఆశించిన దానికంటే ఫ్యాన్ పార్టీకి 164 సీట్లు తక్కువగా వచ్చాయి.

# పవన్ కళ్యాణ్‌కు రెండు కీలక పదవులు.. పిఠాపురానికి జాక్ పాట్..!

అమరావతి : పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లక్ మారింది. గత పదేళ్లుగా రాజకీయాల్లో ఉన్న ఆయన.. చెమటోడ్చి పని చేశారు. రెండు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రజల్ని తనను ఆదరించకపోయినా... రాజకీయాల నుంచి వెనక్కి తగ్గలేదు. ఓపికతో ఎదురు చూశాడు. ధైర్యంతో పోరాడాడు. చివరికి మూడో సారి ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీతో పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పవర్ స్టార్ విజయం సాధించాడు. బీజేపీ, టీడీపీతో కలిసి కూటమిగా జనసేనను పోటీగా దింపారు పవన్ కల్యాన్. ఏపీ వ్యాప్తంగా మొత్తం 21 స్థానాల్లో బరిలోకి దిగారు. అయితే పవన్ గత ఎన్నికల్లో పార్టీకి ఒక్కటంటే ఒక్క సీటే వచ్చింది. కానీ ఈ సారి జనసేన ఏకంగా 15కు పైగా స్థానాల్లో గెలుపు దిశగా పరుగులు తీసింది. అయితే ఈసారి పవన్ కళ్యాణ్‌కు కీలక పదవి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ... పవన్ కళ్యాణ్‌ను ఏకంగా డిప్యూటీ సీఎం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాటు.. ఆయనకు హోమ్ మినిస్ట్రీ కూడాఇచ్చే ఛాన్స్ కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్‌కు రెండు కీలక పదవులు రావడంతో... ఆయన అభిమానులు, జనసేన నాయకులు కార్యకర్తలు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇప్పటికే పవర్ స్టార్ అభిమానులంతో పిఠాపురానికి భారీగా చేరుకున్నారు. అక్కడ ప్రస్తుతం అంతా కోలాహలం కనిపిస్తుంది. పిఠాపురం అంతా జనసైనికుల హడావుడి వాతావరణం కనిపిస్తుంది. ఇక పిఠాపురం నియోకవర్గ ప్రజలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ గెలుపొందడం.. కూటమి అధికారంలోకి రావడంతో.. తమ నియోజకవర్గం కూడా జాక్ పాట్ కొట్టిందని భావిస్తున్నారు. పిఠాపురం మరింత అభివృద్ధి చెందుతుందని అక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పవన్ డిప్యూటీ సీఎం అయితే.. పిఠాపురంపై ప్రత్యేక దృష్టి పెడతారని... నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని అక్కడి జనం భావిస్తున్నారు.



# స్టాలిన్ క్లీన్ స్వీప్ జగన్ కు నేర్పుతున్న పాఠమిదే..! అసలు తేడా ఇక్కడే..



అమరావతి : తాజాగా వెలువడిన లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో ఇరుగుపొరుగున ఉన్న రెండు దక్షిణాది రాష్ట్రాలు ఆంధ్రా, తమిళనాడులో పూర్తి భిన్నమైన ఫలితాలు వెలువడ్డాయి. ముఖ్యంగా ఇద్దరు యువ ముఖ్యమంత్రుల పాలనతో ఇరు రాష్ట్రాలు అనుసరించిన విధానాలతో జనం వారికి తీర్పు ఇచ్చారు. అయితే ఈ తీర్పు ఒకరికి మోదాన్నీ, మరొకరికి ఖేదాన్నీ మిగిల్చింది. అయితే ఇందుకు దారి తీసిన కారణాలు మాత్రం భవిష్యత్తులో ప్రభుత్వాలు నడపాలనుకునే ప్రతీ రాజకీయ పార్టీకి కచ్చితంగా పాఠమే. తమిళనాడులో జరిగిన లోక్ సభ ఎన్నికల్ని డీఎంకే నేతృత్వంలోని ఇండీ కూటమి ప్రభుత్వం క్లీన్ స్వీప్ చేసి పారేసింది. మొత్తం 39 సీట్లతో పాటు పొరుగున ఉన్న పుదుచ్చేరి సీటులోనూ ఏకపక్షంగా విజయం సాధించింది. దీంతో అధికారం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా ఎంకే స్టాలిన్ ప్రభుత్వ విధానాలపై ప్రభుత్వం ఏ స్థాయిలో సంతృప్తిగా ఉన్నారో అర్దమవుతోంది. ముఖ్యంగా సంక్షేమంతో పాటు ఉద్యోగాల కల్పన, సమ్మిళిత అభివృద్ధితో ముందుకెళ్తున్న స్టాలిన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. మరోవైపు ఏపీలో ఐదేళ్ల క్రితం 151 సీట్ల మెజార్టీతో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈసారి ఎన్నికల్లో దాదాపు రాష్ట్రంలో తుడిచిపెట్టుకుపోయింది. పూర్తిగా సంక్షేమ పాలన అమలు చేసి అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిన జగన్ సర్కార్ కు జనం కర్రుకాల్చి వాత పెట్టారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు దింపేశారు. అంటే ఏకంగా 140 సీట్లను లాగేసుకున్నారు. అయితే ఇంతటి జనాగ్రహం వెనుక ఏముందని చూస్తే కర్ణుడి చావుకి లక్ష కారణాల్లా కనిపిస్తున్నాయి. కానీ పొరుగున ఉన్న స్టాలిన్ పాలన చూస్తే ఎక్కడ తేడా కొట్టిందో అర్థమవుతుంది. జగన్ లా స్టాలిన్ సంక్షేమ పథకాలు ఒక్కటే నమ్ముకోలేదు. ఐదేళ్ల క్రితం లోక్ సభ ఎన్నికల్ని డీఎంకే కూటమి క్లీన్ స్వీప్ చేశాక మూడేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్నీ క్లీన్ స్వీప్ చేసింది. ఆ తర్వాత ఏర్పడిన స్టాలిన్ సర్కార్ సంక్షేమంతో పాటు ఉద్యోగాల కల్పన, ప్రజారోగ్యానికి ఇచ్చిన ప్రాధాన్యం, సమ్మిళిత అభివృద్ధి అజెండాతో ముందుకెళ్లిన తీరు.. ఈసారి ఎన్నికల సమయంలో వారు ఏం చెప్తే జనం అది నమ్మే పరిస్థితి తీసుకొచ్చింది. సరిగ్గా రెండు నెలల క్రితం కోయంబత్తూరులో రాహుల్ పాల్గొన్న భారీ బహిరంగసభకు హాజరైన జనాన్ని చూసి బాహుబలిగా స్టాలిన్ అభివర్ణించారు. ఈ ఒక్క సభతో జనం బీజేపీని, దాని రహస్యమిత్రపక్షం అన్నాడీఎంకేని తుంగలో తొక్కారని తేల్చేశారు. చివరికి అదే నిజమైంది. మోడీని మళ్లీ గెలిపిస్తే రిజర్వేషన్లను తీసేస్తాడని, సామాజిక న్యాయం అంటే బీజేపీకి అలర్జీ అని స్టాలిన్, రాహుల్ చెప్పిన మాటల్ని తమిళనాడు అక్షరాలా నమ్మింది. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసే భారీ సంక్షేమ పథకాల జోలికెళ్లకుండా మహిళలకు నెలకు వెయ్యి సాయం, పాఠశాల విద్యార్థులకు సీఎం అల్పాహార పథకం, మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అందించారు. రాష్ట్రానికి మేం ఇది చేశాం, మీరేం చేశారో చెప్పండని స్టాలిన్ అడిగిన ప్రశ్నకు మోడీ వద్ద సమాధానమే లేదు. ఎప్పుడో ముగిసిన కచ్చతీవు సమస్యనుకెలకడం ద్వారా స్టాలిన్ ను ఇరుకుపెట్టేందుకు మోడీ చేసిన ప్రయత్నాల్నీ శ్రీలంకనూ అడ్డుకోలేవు, చైనానూ ఎదిరించలేవంటూసమర్థంగా తిప్పికొట్టారు. ఇవన్నీ స్టాలిన్ నేతృత్వంలోని కూటమికి మరో అప్రతిహత విజయాన్ని కట్టబెట్టాయి.

# సీఎం పదవికి వైఎస్ జగన్ రాజీనామా.. కేసీఆర్‌ను ఫాలో అయిన వైసీపీ అధినేత..



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి వైఎస్ జగన్ రాజీనామా చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగగా.. అందులో అధికార వైసీపీ ఘోర పరాజయం పాలైంది. ఈ క్రమంలోనే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అయితే సీఎం పదవికి రాజీనామా చేసే విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రూట్‌నే జగన్ ఫాలో అయ్యారు. గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఫలితాల వెల్లడి తర్వాత బీఆర్ఎస్ ఓటమితో కేసీఆర్ సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో కేసీఆర్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు స్వయంగా రాజీనామా సమర్పించనున్నట్టుగా వార్తలు వచ్చాయి. అయితే చివరకు కేసీఆర్ తన సిబ్బంది ద్వారా రాజీనామా లేఖను గవర్నర్‌కు పంపారు. అయితే ఇప్పుడు జగన్ కూడా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా లేఖను సమర్పించనున్నారని ఈరోజు సాయంత్రం వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు జగన్ కూడా రాజ్‌భవన్‌కు వెళ్లకుండా.. తన రాజీనామా లేఖను సిబ్బంది ద్వారా గవర్నర్‌కు పంపించారు. ఇక, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ స్పందించారు. తాడేపల్లిలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఘోర ఓటమి నేపథ్యంలో జగన్ చాలా నిరాశతో, కళ్లలో నీళ్లు తిరిగు తున్నట్టుగా కనిపించారు. ఈ సందర్భంగా జగన్ కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. జగన్ మాట్లాడుతూ.. ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి.. ఇలా జరుగుతుందని, ఫలితాలు ఇలా వస్తాయని ఊహించలేదని చెప్పారు. అమ్మ ఒడితో 53 లక్షల తల్లులకు మంచి చేశామని.. మరి అక్కాచెల్లెమ్మల ఓట్లు ఏమయ్యాయో తెలియదని అన్నారు. 66 లక్షల మంది అవ్వతాతలకు, వికలాంగులకు, వింతతువులకు పెన్షన్ ఇచ్చామని.. గతంలో ఎప్పుడూ జరగని విధంగా మంచి చేశామని.. గతానికి భిన్నంగా ఎంతో మంచి చేస్తూ ముందుకు సాగిన కూడా అవ్వతాతలు చూపిన అప్యాయత కూడా ఏమైందో తెలియడం లేదని చెప్పుకొచ్చారు. 1.05 లక్షల మంది పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలకు మంచి చేస్తూ.. ఇచ్చిన మాట తప్పకుండా వారికి అండగా నిలిచామని.. మరి వారి ప్రేమాభిమానులు ఏమయ్యాయో తెలియదని జగన్ అన్నారు. చేయూత అందుకుంటున్న 26 లక్షల అక్కాచెల్లెమ్మల అప్యాయత ఏమైందో తెలియదని అన్నారు. పిల్లల చదవులకు అండగా నిలిచామని, చదవుల్లో ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. ఆ పిల్లలు, తల్లుల అభిమానం ఏమైందో కూడా తెలియదని అన్నారు. దాదాపుగా 54 లక్షల రైతన్నలకు గతంలో ఎప్పుడూ జరగని విధంగా పెట్టుబడి సాయం అందించామని.. సమయానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని.. పగటిపూట 9 గంటల కరెంట్ ఇచ్చామని.. మరి వారి ప్రేమ ఏమైందో తెలియదని జగన్ అన్నారు. ఆటో డ్రైవర్లకు అండగా ఉంటూ వాహనమిత్ర, నేతన్నలకు అండగా ఉంటూ నేతన్న నేస్తం, మత్స్యకారులకు అండగా ఉంటూ మత్స్యకార భరోసా ఇచ్చామని.. ఇలా కోట్లాది మందికి మంచి చేశామని చెప్పారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలను చేశామని తెలిపారు. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి.. ప్రతి ఇంటికి సేవలందించే కార్యక్రమం చేశామని చెప్పారు. దాదాపు 2.70 లక్షల కోట్ల రూపాయలను ప్రజలకు అందించామని చెప్పారు. అన్ని రంగాలలో సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. వారందరి అభిమానం, అప్యాయత ఏమైందో తెలియదని అన్నారు. ఎవరో మోసం చేశారని, అన్యాయం చేశారని అనొచ్చు గానీ.. ఆధారాలు లేవని అన్నారు. ఏం జరిగిందో దేవుడికి తెలుసునని చెప్పుకొచ్చారు. ప్రజల తీర్పును తీసుకుంటామని.. మంచి చేయడానికి ప్రజలకు తోడుగా ఉంటామని చెప్పారు. పేదవారికి తోడుగా ఉంటూ.. వారి తరఫున గళం వినిపిస్తా మని తెలిపారు. అది పెద్ద పెద్ద వాళ్ల కూటమి ఇది అని.. ఢిల్లీలో సైతం శాసించే స్థితిలో ఉన్న కూటమి అని అన్నారు. ఆ కూటమిలో ఉన్న బీజేపీకి, చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు అందరికి కూడా వారి గొప్ప విజయానికి అభినందనలు తెలుపుతున్నట్టుగా చెప్పారు. అయితే తాము ఓడిపోయినప్పటికీ.. తన ప్రతి కష్టంలో తోడుగా, అండగా నిలబడిన తమ పార్టీ నాయకులకు, కార్యకర్తకు, వాలం టీర్‌కు, ప్రతి స్టార్ క్యాంపెయినర్‌కు మనస్ఫూర్తిగా థాంక్స్ చెబుతు న్నట్టుగా చెప్పారు. ఏం జరిగిందో తెలియదు గానీ.. ఏమి చేసినా, ఎంత చేసినా 40 శాతం ఓటు బ్యాంకు మాత్రం తగ్గించలే కపోయా రని అన్నారు. కచ్చితంగా పుంజుకుంటామని, గుండె ధైర్యంతో నిలబడతామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉండటం, పోరా టాలు చేయడం కొత్త కాదని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఈ ఐదేళ్లు తప్ప మిగిలిన కాలం అంతా ప్రతిపక్షంలోనే గడిపానని చెప్పారు.

# వైసీపీ ఓటమిలో కీ రోల్..! ఎస్సీ, ముస్లిం ఓట్లకు గండి కొట్టింది ఎవరు..?



అమరావతి : అప్పుడు అన్న వదిలిన బాణం. ఇప్పుడు అన్నకే గుచ్చుకున్న బాణం. కనిపించిన శత్రువు, కనిపించకుండా చేసిన గాయంవైసీపీని సలుపుతోంది. జగన్ ఓటమిలో చెల్లి షర్మిల పాత్ర ఎంత?కాంగ్రెస్‌ని గెలిపించలేకపోయినా, వైసీపీని ఓడించడంలో షర్మిల కీలక పాత్ర పోషించారా?ఆమె ఒకప్పుడు అన్న వదిలిన బాణం. 2014లో జగన్ కోసం, వైసీపీ కోసం.వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారు షర్మిల. ఆ తర్వాత 2019లో కూడా అన్న కోసం మరోసారి కొంగు బిగించి ఎన్నికల రణరంగంలోకి దూకారు. ఆ తర్వాత జగన్‌తో షర్మిలకు గ్యాప్ వచ్చింది. ఇద్దరి దారులు వేరయ్యాయి. రాజకీయ లక్ష్యాలు, గమ్యాల్లో కూడా తేడా వచ్చింది. ఆ తర్వాత తెలంగాణలో వైఎస్సార్‌టీపీ అనే పార్టీ పెట్టిన షర్మిల మరోసారి పాదయాత్ర చేశారు. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కంటే కొద్దిగా ముందుగానే అక్కడ కొట్టు కట్టేశారు షర్మిల. కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. ఆ తర్వాత ఏపీ పీసీసీ చీఫ్‌గా పగ్గాలు చేపట్టిన షర్మిలఏకంగా అన్న జగన్ పైనే విమర్శల బాణాలు సంధించడం మొదలుపెట్టారు. జగన్‌కు కంట్లో నలుసుగా మారారు. ఇంటి వ్యక్తి శత్రువుగా మారితేఆ బాధలు ఇంతింత కాదయా అనే లెవెల్లో జగన్‌ను ఇబ్బందులు పెట్టారు. అన్న వదిలిన బాణం%ో%చివరకు అన్నకే గుచ్చుకుంది. ఏపీలో కాంగ్రెస్‌కు 2 శాతం కంటే కాస్త తక్కువగా ఓట్లు వచ్చినా, చాలా చోట్ల వైసీపీని ఇబ్బంది పెట్టగలిగారు షర్మిల. మరీ ముఖ్యంగా ఎస్సీలు, ముస్లిం మైనారిటీలు ఎక్కువగా ఉండే చోట్ల షర్మిల ఫ్యాక్టర్ పని చేసిందని చెబుతున్నారు. గుంటూరు ఈస్ట్ లాంటి చోట్ల కాంగ్రెస్‌కు మైనారిటీల ఓట్లు బాగానే పడ్డాయనే అంచనా ఉంది.

# The three states that dealt the biggest blow to BJP

